# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 16 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 141 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


### ఆ గాయకుడిపై నోట్ల వాన



2

### పతనమైన రూపాయి మారకపు విలువ



4

# పుట్టపర్తి నుంచి ఎగరనున్న భారత గగనశక్తి



**రాయలసీమకు రక్షణ పరిశ్రమల మహా వరం..ఏపీ ఇప్పుడు అడ్వాన్స్ ఆంధ్ర ప్రదేశ్**

- కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్
- చంద్రబాబు లాంటి దార్శనిక నేత అరుదు
- కర్నూలు భవిష్యత్తులో ప్రపంచ డ్రోన్ హబ్..
- రూ.15 వేల కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టు
- రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ తీర్చిదిద్దాలి



శ్రీ సత్య సాయి జిల్లా మే 15 మనం న్యూస్: రక్షణ పరిశ్రమలతో రాయలసీమకు కొత్త దిశ పుట్టపర్తి నుంచి ఎగరనున్న దేశ గగనశక్తి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి దేశ రక్షణ రంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలవనుంది. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో రాజ్నాథ్ సింగ్ మాట్లాడుతూ పుట్టపర్తి వంటి ఆధ్యాత్మిక కేంద్రంలో దేశ రక్షణ శక్తిని బలోపేతం చేసే ప్రాజెక్టు రావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, దేశ రక్షణ రంగానికి కూడా కొత్త దిశ లభిస్తోందన్నారు.తన రాజకీయ జీవితంలో సాంకేతికత, అభివృద్ధి, భవిష్యత్ దృష్టితో ఆలోచించే నాయకుడిగా చంద్రబాబు నాయుడు వంటి నేతను తాను చూడలేదని రాజ్నాథ్ సింగ్ కొనియాడారు. ఆధునిక సాంకేతిక రంగాలను ముందుగానే అంచనా వేసి రాష్ట్రానికి తీసుకురావడంలో చంద్రబాబు ప్రత్యేక గుర్తింపు సాధించారని తెలిపారు. క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ...మిగతా 2లో

## సీఎం పర్యటనకు సర్వం సిద్ధం చేయాలి



అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు

2

ముమ్మర ఏర్పాట్లపై అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష

## మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

ఆర్డిటి విషయంలో ఆయన చూపిన చొరవకు రుణపడి ఉంటాం

భవిష్యత్తులో కూడా ఆర్డిటికీ ప్రభుత్వ సహకారం



ధర్మవరం అర్బన్ మే 15 మనం న్యూస్: ఐటి, విద్యాశాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేసిన కార్యకర్తలకు, మహిళలకు, యువతకు, నాయకులకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం జరిగిన నారా లోకేష్ పర్యటనకు కార్యకర్తల నుంచి ...మిగతా 2లో

## జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్

హాల్ టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్న ఎన్టీఏ

విద్యార్థులు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ

2

## వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్

ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఢిల్లీ, మే 15 : నీట్ యూజీ 2026 జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాటాడుతూ.. వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను ఆన్ లైన్ లో నిర్వహిస్తామని వెల్లడించారు. 'జూన్ 21న ...మిగతా 4లో

## పుట్టపర్తిలో ఆధునిక డయాలసిస్ సెంటర్ ప్రారంభం

- బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ సహకారంతో సేవలు...
- 7.4 కోట్లతో క్యాన్సర్ కేర్ సెంటర్ నిర్మాణం
- ఉచిత వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం..
- రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



పుట్టపర్తి, మే 15 మనం న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ప్యాలియేటివ్ కేర్ అండ్ క్యాన్సర్ సెంటర్ లో బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక డయాలసిస్ సెంటర్ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి ...మిగతా 4లో

## 26న కేరళకు నైరుతి రుతుపవనాలు

వారం ముందే వానలు!



ఢిల్లీ, మే 15 : ఎండ దెబ్బకు అల్లాడిపోతున్న భారతీయులకు వాతావరణ విభాగం చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నట్లు వెల్లడించింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. కానీ, ఈసారి ఐదు రోజులముందే కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ శుక్రవారం వెల్లడించింది. భారత ఆహార ...మిగతా 2లో

# ఎక్సైజ్ శాఖను గాడిలో పెట్టిన సీఎం చంద్రబాబు



ఏపీలో ఎక్సైజ్ శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు సీఎం చంద్రబాబు. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి, ఎక్సైజ్ ఆదాయం పెరిగేలా చేశారు. పారదర్శకత, నాణ్యతతో కొత్త ఎక్సైజ్ విధానం రూపొందించారు. మద్యం నాణ్యతపై ల్యాబుల్లో పెద్ద ఎత్తున పరీక్షలు చేయడమే కాకుండా, ట్రాక్ అండ్ ట్రేస్, ఎక్సైజ్ సురక్ష యాప్లతో పారదర్శకత పెంచారు. ఎన్నికల హామీ మేరకు కల్లుగీత కార్మికులకు 10శాతం షాపులు కేటాయించారు.

(అమరావతి- పి.మీరాహుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): రెండేళ్ల క్రితం ఏపీలో మద్యం అంటే భయం... అనుమానం... అసంతృప్తి.... దోపిడీ. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. అదే ఎక్సైజ్ శాఖలో పారదర్శకత, నాణ్యత, టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ, ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ అనేక సంస్కరణలతో ఎక్సైజ్ శాఖ గాడిలో పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే సంస్కరణలు తీసుకురావాలని భావించిన శాఖల్లో ఎక్సైజ్ శాఖ ప్రధానంగా ఉంది. దీంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనపై సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆ దిశగా ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంది. ఎస్.ఇ.బి.ను ...మిగతా 2లో

## అమెరికా క్షీణిస్తున్న దేశం



అది పతన దిశగా పయనిస్తోందన్న జిన్‌పింగ్

అవును.. కానీ, అది జో బైడెన్ హయాంలో అని ట్రంప్ జవాబు

బీజింగ్, మే 15 : అమెరికా పతనం అంచున ఉందని చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ పేర్కొన్నారు. ఈ అభిప్రాయంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఏకీభవించారు. అయితే, అది మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో ...మిగతా 2లో

## అత్యంత వైభవంగా శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు



వాహనసేవలతో పాటు భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించాలి

జేఈవో వి. వీరబ్రహ్మం

3

## పసిడి ప్రియులకు ఊరట..



- భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు
- కొనసాగుతున్న బంగారం ర్యాలీకి బ్రేక్
- 10 గ్రాముల బంగారంపై రూ.2,240 వరకు తగ్గుదల
- హైదరాబాద్‌లో రూ.1.60 లక్షలకు దిగివచ్చిన పసిడి
- కిలో వెండి ధరలో రూ.10,000 భారీ కోత

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఇటీవల పరుగులు పెడుతున్న బంగారం ధరల జోరుకు బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాలను పెంచడం వంటి కారణాలతో శుక్రవారం దేశీయ మార్కెట్లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. కొనుగోలుదారులకు ఇది కాస్త ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన ...మిగతా 4లో

## 20న. ఔషధ దుకాణాల బంద్..!



5

# పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడ్డాయి

- పుట్టపర్తిలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకం
- దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగానూ పుట్టపర్తి మారుతుంది
- సీఎం నారా చంద్రబాబు నాయుడు

అనంతపురం. మే 15 మనం బ్యూరో: పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడ్డాయని, పుట్టపర్తిలో అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ రావడం ఎంతో కీలకమని, దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం పుట్టపర్తిలో ...మిగతా 2లో



## మోడీకి ఫైటర్ జెట్‌తో స్వాగతం పలికిన యూఏఈ

2

## పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

లీటర్‌కు రూ. 3 పెంపు



2

## నైపుణ్యాలే యువత భవితను నిర్ణయిస్తాయి: కేంద్ర మంత్రి పెమ్మసాని



- గుంటూరులో భారీ స్థాయిలో స్కిల్ ట్రైనింగ్ దృష్టి
- గుంటూరులో శిక్షణ సామర్థ్యాన్ని 17 వేల మందికి పెంచడమే లక్ష్యం
- నైపుణ్యాలు యువత భవిష్యత్తును నిర్ణయిస్తాయి

2

# ఎక్సైజ్ శాఖను గాడిలో పెట్టిన సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసి ఎక్సైజ్ శాఖ మొత్తాన్ని ఏకీకృతం చేసింది. ఎక్సైజ్ శాఖలో చోటు చేసుకున్న మద్యం కుంభకోణంపై శ్వేత పత్రాన్ని ముఖ్యమంత్రి విడుదల చేశారు. గతంలో అమలు చేసిన ఆన్ లైన్ ఆర్డర్ ఫర్ సప్లై విధానాన్ని ఎక్సైజ్ శాఖ తీసుకొచ్చింది. ఐజీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఖిఐఖీ ఏర్పాటు చేసి అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలిచ్చింది. నూతన మద్యం పాలసీ (2024-2026) ప్రకటించి లాటరీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు కేటాయించారు. పారదర్శకమైన విధానాల ఫలితంగా దాదాపు 90 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.1800 కోట్ల ఆదాయం సమకూరింది. 10 శాతం మేర షాపులు అంటే... 354 దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో ఎఇఆర్.టి పేరుతో ప్రజలపై భారం మోపారు. ఆ భారాన్ని తగ్గిస్తూ ఎఇఆర్.టిని ప్రభుత్వం రద్దు చేసింది. గతంలో మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీలు 0.6 శాతం మాత్రమే ఉంటే ప్రస్తుతం 45శాతానికి చేర్చడం ద్వారా పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది ఎక్సైజ్ శాఖ.

**అందుబాటులోకి ప్రీమియం బ్రాండ్లు..**

అన్ని బ్రాండ్లకు పారదర్శకంగా అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా టెండర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్సైజ్ శాఖ అవకాశం కల్పిస్తోంది. అంతర్జాతీయ బ్రాండ్లను కూడా అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 11 ప్రీమియం స్టోర్లను ఏర్పాటు చేసింది ఎక్సైజ్ శాఖ. నాటు సారా, కల్తీ మద్యం వైపు ఎవరూ వెళ్లకుండా చేయడం లక్ష్యంగా రూ.99 బ్రాండ్ అందుబాటులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వ హయాంలో పారదర్శకమైన విధానం అమలు చేయడం, జాతీయ, అంతర్జాతీయ, ప్రీమియం బ్రాండ్లు అందుబాటులోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాలతో సమానంగా ధరలు ఉండడంతో అక్రమ రవాణా దాదాపు నిలిచిపోయిందనే చెప్పాలి. ఫలితంగా 2024-25లో రూ.28,846 కోట్లు, 2025-26లో రూ.29,042 కోట్ల మేర ఎక్సైజ్ రెవెన్యూ వచ్చింది. మద్యం షాపుల నుండి బార్లకు మద్యం అక్రమ రవాణా నివారించేలా బార్లలో కూడా ఎమ్మార్పీ విధానాన్ని అవలంభించేలా చర్యలు తీసుకుంది కూటమి ప్రభుత్వం. డిస్టిలరీల నుంచి షాపుల వరకు ప్రతి మద్యం బాటిల్ ట్రాక్ అండ్ ట్రేస్ విధానంలో పర్యవేక్షించేలా ఎక్సైజ్ శాఖ జాగ్రత్తలు తీసుకుంది.

**13 రకాల పరీక్షలు...**
**30 వేల శాంపిళ్ల టెస్టులు**

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి మద్యం బ్యాచ్కు 13 రకాలైన పరీక్షలు నిర్వహించిన అనంతరమే మార్కెట్లోకి వెళ్లేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. అందుకోసం విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, చిత్తూరు, కర్నూలులో అత్యాధునిక ల్యాబరేటరీలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. గతంలో ఏటా సగటున 14 వేల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తే, ప్రస్తుతం ప్రతి నెల సగటున 30 వేల పరీక్షలు చేస్తూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటోంది. గంజాయి నిర్మూలన కోసం ఈగిల్ టీమ్స్ ఏర్పాటు చేయడం... మద్యం ఆదాయంలో 2 శాతం బడ్జెట్ ఈగిల్ వ్యవస్థకు కేటాయించడం వంటి చర్యలు ఎక్సైజ్ శాఖ చేపడుతోంది. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం వినియోగ దారులు ఎవరైనా, ఎక్కడైనా బాటిళ్లను స్కాన్ చేసే అవకాశం కల్పించారు. మద్యం బాటిళ్ల తయారీ నుంచి షాపుకు వచ్చే వరకు ప్రతి సమాచారం తెలుసుకునే వెసులుబాటును ఎక్సైజ్ శాఖ కల్పించింది. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా మద్యం షాపుల్లోని సీసీ కెమెరాలన్నింటినీ అనుసంధానించి ఏ షాపును ఎప్పుడు తెరుస్తున్నారు, ఎప్పుడు మూస్తున్నా రోననే అంశంపై నిరంతరం మానిటర్ చేస్తున్నారు.

**ఎక్సైజ్ వ్యవస్థను**
**హైజాక్ చేసిన నాటి ప్రభుత్వం**

రాష్ట్రంలో దశలవారీగా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తామని... మద్యం విక్రయాలను కేవలం ఫైవ్ స్టార్ హోటళ్లకు మాత్రమే పరిమితం చేస్తామని 2019 ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మద్యం నిర్మూలన కాదు నియంత్రణ అన్నారు. తర్వాత ప్రభుత్వ మద్యం షాపులు అన్నారు. అప్పటి వరకు ఉన్న మద్యం బ్రాండ్లను నాటి ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు తొలగించారు. ప్రపంచంలో ఎక్కడా లేని, ఎప్పుడూ కనీ వినీ ఎరుగని బూం బూం, ప్రెసిడెంట్ మెడల్ లాంటి బ్రాండ్లు తీసుకొచ్చారు. వినియోగదారుడు తనకు నచ్చిన బ్రాండ్ కాకుండా.. తాము అమ్మే బ్రాండ్ తాగాల్సిందే అనే పరిస్థితి తీసుకొచ్చి ఎక్సైజ్ వ్యవస్థ మొత్తాన్ని నాటి ప్రభుత్వ పెద్దలు హైజాక్ చేశారు. కల్తీ, నకిలీ మద్యాన్ని ప్రభుత్వ షాపుల్లోనే అమ్మారు. చిన్న బడ్డీ కొట్టులో డిజిటల్ పేమెంట్ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో కూడా ఏ మద్యం షాపులోనూ డిజిటల్ లావాదేవీలను గత ప్రభుత్వం జరగనివ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో 99.38 శాతం లావాదేవీలు క్యాష్ అండ్ క్యారీ విధానంలోనే జరిగాయని లెక్కలు చెబుతున్నాయి. నాడు నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడం, ధరలు భారీగా ఉండడంతో తమిళనాడు, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అడ్డగోలుగా పెరిగింది. మద్యం అక్రమాలను ఎవరూ అడ్డుకోవడానికి వీల్లేదు అన్నట్లు ఎక్సైజ్ శాఖను విడగొట్టి సరైన నిఘా లేకుండా చేశారు. ఒక్కో మద్యం బ్రాండు సరఫరాపై కేసుకు అనధికారికంగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. మద్యం తయారీ సంస్థల నుంచి, బీర్ తయారీ కంపెనీల నుంచి కోట్లాది రూపాయలు దోచుకున్నారని దర్యాప్తు సంస్థలు సైతం నిర్ధారించిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 76% మంది మహిళలు మానసిక, శారీరక, లైంగిక వేధింపులకు గురయ్యారు. 2019తో పోలిస్తే 2023 నాటికి 52 శాతం లివర్ సమస్యలు, 54 శాతం కిడ్నీ సమస్యలు పెరిగాయి. గుంటూరు జీజీహెచ్లో ఉండే డీ అడిక్షన్ కేంద్రంలో 2019 నాటికి 343 కేసులు ఉంటే.. 2023 నాటికి ఏకంగా 4913కి పెరిగారు. ఇలాంటి పరిస్థితులకు చెక్ చెప్పేలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంది. ప్రజారోగ్య రక్షణకు పెద్ద పీట వేసింది.

**ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు:**
**మంత్రి కొల్లు రవీంద్ర**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండేళ్ల కాలంలో ఎక్సైజ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్సైజ్ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రజలకు నాణ్యమైన మద్యం అందించే లక్ష్యంతో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామన్నారు. గతంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని... కానీ నేడు ప్రతి డిస్టిలరీలో తయారయ్యే మద్యాన్ని ఊాఅ నుంచి డిస్టిలింగ్, బాటిలింగ్ వంటి పలు దశల్లో పరీక్షించడమే కాకుండా.. మద్యం షాపులు, బార్లలో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే బ్రాండ్ మిక్సింగ్ వంటి ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వంలో డిజిటల్ లావాదేవీలు 1శాతం మేర కూడా లేదని... కానీ నేడు 40 శాతానికి పైగా డిటిటల్ లావాదేవీలు నిర్వహిస్తుండమనేది ప్రభుత్వ, ఎక్సైజ్ శాఖ పారదర్శకతకు నిదర్శనమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

(మొదటి పేజీ తరువాయి)

అనూహ్య స్పందన కనిపించింది. ధర్మవరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు నాయకులు తరలివచ్చి మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి నుంచి రోడ్డు మార్గంలో వచ్చిన మంత్రి నారా లోకేష్ కు ధర్మవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికారు. పట్టణంలో ఆయనకు పూల వర్షం కురిపించి అభివానం చాటుకున్నారు. బత్తలపల్లి మండల కేంద్రంలో ఒక జనసంద్రం కనిపించింది. కార్యకర్తలు భారీగా తరలి రావడంతో నాలుగు మార్గాల్లో పసుపు జెండాలు కనిపించాయి. నారా లోకేష్ కి జై అంటూ బత్తలపల్లి మండల కేంద్రం దద్దరిల్లింది. ఈ పర్యటనను ఇంత విజయవంతం చేసిన కార్యకర్తలకు పరిటాల శ్రీరామ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తొలిసారి నియోజకవర్గానికి రావడమే కాకుండా ఆర్డిటికీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేయించినందున మంత్రి లోకేష్ కు ఈ స్థాయిలో స్వాగతం లభించిందని అన్నారు. ఆర్డిటికీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కాక ఇబ్బందికర పరిస్తితులు ఉన్న సమయంలో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమిత్ షా తో ఇక్కడ పరిస్థితి అంతా వివరించారన్నారు. ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కావడంలో నారా లోకేష్ ది చాలా కీలకమైన పాత్ర ఉందన్నారు. ఇందుకు జిల్లా ప్రజలు ఎప్పటికీ ఆయనకి రుణపడి ఉంటారన్నారు. భవిష్యత్తులో కూడా ఆర్డిటికీ ప్రభుత్వ సహకారం ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు..

# పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

**ఢిల్లీ, మే 15 :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్, డీజిళ్ల పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్ సభ



ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. సీఎన్జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్జీని రూ.2 చొప్పున పెంచాయి.

# పుట్టపర్తి నుంచి ఎగరనున్న భారత గగనశక్తి

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. గూగుల్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు ఆంధ్రప్రదేశ్ను పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా ఎంచుకోవడం రాష్ట్ర సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు. ఏపీ అంటే ఇప్పుడు అడ్వాన్స్డ్ ప్రదేశ్ దేశానికి రోల్ మోడల్గా ఎదుగుతోంది అని వ్యాఖ్యానించారు.

**5వ తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ**

ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ప్రస్తుతం అత్యాధునిక 5వ తరం స్టెల్త్ యుద్ధ విమానాల అభివృద్ధిపై పని చేస్తోందని రాజ్నాథ్ సింగ్ వెల్లడించారు. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టులో ఎయిర్క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ సెంటర్తో పాటు అత్యాధునిక ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రం కూడా ఏర్పాటు కానుంది.

ప్రపంచంలో చాలా కొద్ది దేశాలకే ఇలాంటి సౌకర్యాలు ఉన్నాయని, ఇప్పుడు భారత్ కూడా ఆ జాబితాలో చేరుతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో తయారయ్యే యుద్ధ విమానాలు పుట్టపర్తి నేల నుంచే టేకాఫ్ అవుతాయి. అవి భారత గగనశక్తిని ప్రపంచానికి చాటుతాయి అని గర్వంగా చెప్పారు.

**కర్నూలులో డ్రోన్ సిటీ**

కర్నూలులో ఏర్పాటు కానున్న డ్రోన్ సిటీపై కూడా రాజ్నాథ్ సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎనిమిది డ్రోన్ కంపెనీలు కలిసి అక్కడ ఆధునిక డ్రోన్ పరిశ్రమల కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సూరత్ డైమండ్ సిటీగా, బెంగళూరు సిలికాన్ వ్యాలీగా గుర్తింపు పొందినట్లే, భవిష్యత్తులో కర్నూలు ప్రపంచ డ్రోన్ హబ్గా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సా తీర్చిదిద్దాలి.బెంగళూరుకు సమీపంలో ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని దేశ మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సా తీర్చిదిద్దాలని చంద్రబాబుకు రాజ్నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఏర్పడుతున్న రక్షణ పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలు, డ్రోన్ తయారీ యూనిట్లు, ఫ్లైట్ టెస్టింగ్



సెంటర్లు కలిసి దేశ రక్షణ రంగానికి కీలక కేంద్రంగా మారగలవని పేర్కొన్నారు.

**ఆయుధ తయారీలో భారత్ కొత్త శకం**

గతంలో భారత్ ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ దిగుమతి దేశాల్లో ఒకటిగా ఉండేదని, కానీ గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రాజ్నాథ్ సింగ్ తెలిపారు. ఒకప్పుడు దేశంలో రూ.46 వేల కోట్ల విలువైన ఆయుధ ఉత్పత్తి మాత్రమే జరిగేదని, ప్రస్తుతం అది రూ.1.54 లక్షల కోట్లకు చేరుకుందని వెల్లడించారు. స్వదేశీ రక్షణ తయారీ రంగంలో భారత్ వేగంగా ముందుకు సాగుతోందన్నారు

# నైపుణ్యాలే యువత భవితను నిర్ణయిస్తాయి: కేంద్ర మంత్రి పెమ్మసాని

**గుంటూరు,మే, 15, (మనం న్యూస్ ప్రతినిధి):** దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తున్నాం.ప్రస్తుతం గుంటూరు ప్రాంతంలో సంవత్సరానికి సుమారు 6,500 మందికి శిక్షణ ఇచ్చే సామర్థ్యం ఉంది. దీనిని అదనంగా 9 వేల మేర పెంచి మొత్తం 17 వేల మందికి శిక్షణ అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.శిక్షణ కేంద్రాల కొరతను అధిగమించేందుకు మూతపడిన ఇంజనీరింగ్ కళాశాలలను వినియోగంలోకి తీసుకురావడంపై చర్చిస్తున్నాం.తెనాలి బుర్రిపాలెంలో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించిన విధానం మంచి ఫలితాలు ఇచ్చింది. ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.భవిష్యత్తులో కేవలం డిగ్రీలు సరిపోవు నైపుణ్యాలే యువత భవిష్యత్తును నిర్ణయిస్తాయి. వైద్య నైపుణ్యాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలి. గుండె ఆగిపోయిన మొదటి నాలుగు నిమిషాల్లో ఇఖఱ ప్రారంభిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే యువతకు ప్రాథమిక వైద్య శిక్షణ కూడా అవసరం.ఇఖఱలో 30:2 నిష్పత్తి, పల్స్ ఆక్సిమెట్రీ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచాలి.యువత ఉద్యోగం వచ్చిన వెంటనే కనీసం 20 శాతం పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి.కనీసం ఆరు నెలల జీతానికి సమానమైన ఎమర్జెన్సీ ఫండ్ ప్రతి ఒక్కరికీ ఉండాలి.తక్కువ ఖర్చుతో లభించే ప్రమాద భీమా,ఆరోగ్య భద్రత పథకాలపై కూడా యువత అవగాహన పెంచుకోవాలి.నైపుణ్యం ఉన్న యువతే రాష్ట్రానికి, దేశానికి అసలైన బలం. యువతకు ఉద్యోగాలు, ఆర్థిక భద్రత, జీవిత నైపుణ్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.₹నైపుణ్యాలే యువత భవితను నిర్ణయిస్తాయని పెమ్మసాని అన్నారు

**గుంటూరులో భారీ**
**స్థాయిలో స్కిల్ ట్రైనింగ్ దృష్టి**

గుంటూరులో శిక్షణ సామర్థ్యాన్ని 17 వేల మందికి పెంచడమే లక్ష్యం. నైపుణ్యాలు యువత భవిష్యత్తును నిర్ణయిస్తాయి గుంటూరు జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.పెమ్మసాని మాట్లాడుతూ .ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తున్నాం.ప్రస్తుతం గుంటూరు ప్రాంతంలో సంవత్సరానికి సుమారు 6,500 మందికి శిక్షణ ఇచ్చే సామర్థ్యం ఉంది. దీనిని అదనంగా 9 వేల మేర పెంచి మొత్తం 17 వేల మందికి శిక్షణ అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.శిక్షణ కేంద్రాల కొరతను అధిగమించేందుకు మూతపడిన ఇంజనీరింగ్ కళాశాలలను వినియోగంలోకి తీసుకురావడంపై చర్చిస్తున్నాం.తెనాలి బుర్రిపాలెంలో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించిన విధానం మంచి ఫలితాలు ఇచ్చింది.ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.భవిష్యత్తులో కేవలం డిగ్రీలు సరిపోవు.నైపుణ్యాలే యువత భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

# 26న కేరళకు నైరుతి రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఈసారి ఎల్ నినో భయాలు ఉన్నాయి. తూర్పు, మధ్య పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల నేపథ్యంలో ఎల్ నినో ప్రారంభమైందని ఇప్పటికే ఇన్మాయిస్ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థ పరిస్థితులు ఉండగా తాజాగా ఎల్ నినో గా మారిందని వెల్లడించింది. ఈ మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని తెలిపింది. రుతుపవనాలు మొదటి దశలో అంటే జూన్ నుంచి జులై ప్రారంభంలో స్థిరమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి.

# అమెరికా క్షీణిస్తున్న దేశం

(మొదటి పేజీ తరువాయి)

అంటూ విమర్శలు చేశారు. తన పరిపాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్లో ఆయన పోస్టు పెట్టారు. అధ్యక్షుడు జిన్పింగ్ అమెరికాను క్షీణిస్తున్న దేశంగా అభివర్ణించారని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, నిద్రమత్తులో ఉండే జో బైడెన్ (బ్ఛా ఆజీఛీ్బ) పరిపాలనను ఉద్దేశించి ఆయన ఆ వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ విషయంలో చైనా అధ్యక్షుడితో తాను 100% ఏకీభవిస్తానని తెలిపారు. బహిరంగ సరిహద్దులు, అధిక పన్నులు, దారుణమైన వాణిజ్య ఒప్పందాలు, పెరిగిన నేరాలతో సహా అనేక కారణాలతో అమెరికా అపారంగా నష్టపోయిందంటూ బైడెన్ పరిపాలనను విమర్శించారు. తన 16 నెలల అద్భుతమైన పదవీకాలంలో దేశం అసాధారణమైన పురోగతి సాధించిందని ట్రంప్ వెల్లడించారు. రికార్డ్ స్థాయి స్టాక్మార్కెట్లు, కొత్త పెట్టుబడి నిబద్ధతలు, వెనెజువెలాలో సైనిక విజయం, సైనిక చర్యతో ఇరాన్ను నాశనం చేయడం (ఇది ఇంకా కొనసాగుతోంది) వంటివి ఎన్నో జరిగాయన్నారు. నిజానికి ఇంత తక్కువ సమయంలో ఇన్ని అద్భుతమైన విజయాలు సాధించినందుకు జిన్పింగ్ తనను అభినందించాలని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా రెండేళ్ల క్రితం తమ దేశం నిజంగానే పతనం అంచున ఉందని ట్రంప్ తెలిపారు. కానీ, ఇప్పుడు అమెరికా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశమని వెల్లడించారు.

# సీఎం పర్యటనకు సర్వం సిద్ధం చేయాలి

**నరసన్నపేట/నిమ్మాడ ,మే 15 మనం న్యూస్:** శ్రీకాకుళం జిల్లాలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తితో కలిసి ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్లు స్వయంగా నరసన్నపేటలో పరిశీలించారు, సభా కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పర్యటన విజయవంతం చేయాలని ఆదేశించారు.

**నరసన్నపేటలో రూట్**
**మ్యాప్, సభాస్థలి పరిశీలన**

ముఖ్యమంత్రి పర్యటనకు రానున్న నేపథ్యంలో, నరసన్నపేట సమీపంలోని తామరాపల్లి హెలిప్యాడ్, ముఖ్య మంత్రి సభకు ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా పరిశీలించారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యామ్నాయ మార్గాల రూపకల్పన చేపట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం మైదానాలను తక్షణమే చదును చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సత్యవరం కూడలి వద్ద వ్యర్థాల నిర్వహణ (చెత్త నుంచి సంపద) కేంద్రం, ప్లాస్టిక్ గ్రేడింగ్ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా రూట్ మ్యాప్ రూపొందించాలని, వీఐపీల ప్రొటోకాల్ మరియు భద్రతా ఏర్పాట్ల విషయంలో రాజీ పడవద్దని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.

**సామాన్యులకు అసౌకర్యం కలగవద్దు**

ముఖ్యమంత్రి రాక సందర్భంగా నరసన్నపేట, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా, రవాణా ఏర్పాట్లపై మంత్రి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక ప్రజలకు, సామాన్య ప్రయాణికులకు ట్రాఫిక్ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా సీఎం హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభావేదిక వద్దకు చేరుకునే కీలకమైన రూట్ మ్యాప్ను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రద్దీ నియంత్రణకు ముందస్తుగానే బారికేడ్లు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడానికి మైదానాలను తక్షణమే చదును చేయాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలలో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవోలు, డీఎస్పీ, ఇతర పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు , తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడ్డాయి

(మొదటి పేజీ తరువాయి)

ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఏయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్ట్ శిలాఫలాకాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆవిష్కరణ చేసారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఏ. ఎం. సి. ఏ ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు.

భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారన్నారు.

ఆధునికతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఏ. ఎం. సి. ఏ ప్రాజెక్టు ఏర్పాటు అవుతోందన్నారు.

భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందన్నారు.

ఆపరేష్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారన్నారు. ఏ. ఎం. సి. ఏ లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించి నందుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదాలు తెలిపారు.

రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుండడం శుభపరిణామమన్నారు.

ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందన్నారు.

అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వం తమకు సహకారం అందించాయ న్నారు..కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామన్నారు. జెట్ స్పీడ్ తో అనుమతులిచ్చామన్నారు.ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ప్రాజెక్టుతో మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తాయన్నారు.

భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామన్నారు.

ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయన్నారు. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందన్నారు..

ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని తమ కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు..

శ్రీహరికోట అంతరిక్షశక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికే అండగా నిలుస్తుందన్నారు.

గతంలో రాయలసీమ రతనాల సీమ.. కానీ వివిధ కారణాల వల్ల కరవుసీమగా మారిపోయిందన్నారు.

తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పూర్వవైభవం వస్తోందన్నారు.ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు.

ప్రతీ ఎకరాకూ నీరిచ్చేలా కార్యాచరణ చేపట్టామన్నారు.కియా పరిశ్రమకు నీరిచ్చామని,లక్ష కోట్ల రూపాయలతో సీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నామన్నారు.

# మోడీకి ఫైటర్ జెట్‌తో స్వాగతం పలికిన యూఏఈ

**అబుధాబి, మే 15 :** ప్రధాని నరేంద్రమోడీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్ గా వచ్చింది. తమ వాయుసేన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్-16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యేవరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోడీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు.. : మోడీ**

యూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోడీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.

# జూన్ 21న నీట్ రీఎగ్జామ్

**ఢిల్లీ, మే 15 :** ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను జూన్ 21న, ఆదివారం నిర్వహించనున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీ ఎగ్జామ్ కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్టీఏ కోరింది. హాల్ టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది.

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్టీఏ స్పష్టం చేసింది.

**కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు..**

ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీ్ప సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజసాన్ లోని సికార్లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది.

# ఆ గాయకుడిపై నోట్ల వాన

**జునాగఢ్, మే 15 :** ప్రముఖ గుజరాతీ జానపద గాయకుడు గోపాల్ సాధుపై అభిమానులు కరెన్సీ నోట్ల వర్షం కురిపించారు. ఒక భజన కార్యక్రమంలో ఆయన ఆలపించిన గానానికి పరవశించి పోయిన అభిమానులు కరెన్సీ నోట్లు వెదజల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో ఆయన కరెన్సీ నోట్లలో మునిగిపోయారు. జునాగఢ్ లోని ఖంభాలియా గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ప్రత్యేక భజన కార్యక్రమంలో భాగంగా గాయకుడు గోపాల్ సాధు హార్మోనియం వాయిస్తూ పాటలు పాడాడు. ఆయన గాత్రానికి ముగ్ధులైన ప్రజలు వేదిక పైకి వచ్చి డబ్బు సంచులు ఆయనపై కుమ్మరించారు. ఈ డబ్బును సామాజిక సేవ కోసం వినియోగించనున్నట్లు నిర్వహకులు వెల్లడించారు.

# ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లు

- జూన్ 1 నుంచి అమలులోకి
- ఎపిఎస్ పిడిసిడిఎల్ పరిధిలో 1.17 లక్షల ప్రీ-పెయిడ్ మీటర్లు

**తిరుపతి, మే 15మనం న్యూస్:** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఆ సంస్థ కృషి చేస్తోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల బకాయిల ఉపశమనంతోపాటు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు సామర్థ్యంపై ఒత్తిడిని అధిగమించేందుకు ప్రీ-పెయిడ్ మీటర్లను తప్పనిసరిగా అమర్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా సంస్థ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రీ-పెయిడ్ మీటరింగ్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లును ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుంది. అంతేకాకుండా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.ఈ యేడాది జూన్ 1వతేదీ నుంచి ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లను అమలులోకి తీసుకువచ్చేందుకు సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంటోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు/మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు సంబంధించి నెల్లూరు జిల్లాలో 17,067, తిరుపతి 19,545, చిత్తూరు 14,622, అన్నమయ్య 14,346, కడప 16,261, అనంతపురం 8,422, శ్రీ సత్యసాయి 7,002, కర్నూలు 10,603, నంద్యాల జిల్లాలో 9,945, సర్వీసులు ఈ ప్రీ-పెయిడ్ విధానంలోకి మారుతున్నాయి.

ఈ మొత్తం 1.17 లక్షల సర్వీసుల్లో సింగిల్ ఫేజ్ సర్వీసులు 91,306, త్రీఫేజ్ సర్వీసులు 26,507 వున్నాయి. ఈ సర్వీసులన్నింటినీ కొన్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఈ-వాలెట్ ద్వారా రీచార్జ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించడం జరుగుతోంది. ఆయా విభాగాలు బిల్లింగ్ సైకిల్ కు సంబంధించిన విద్యుత్ చార్జీలు, స్థిర చార్జీల అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుంది. ప్రతినెలా 5వతేదీలోగా ఆయా సంస్థలు చెల్లించాల్సిన అడ్వాన్స్ మొత్తం వివరాలను విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్థిక శాఖకు తెలియజేయాల్సి వుంటుంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్సి) ఆమోదించిన యూనిట్ ధరల ప్రకారం ప్రీ-పెయిడ్ విధానం ద్వారా రోజువారీ విద్యుత్ వినియోగ చార్జీలను బ్యాలెన్స్ నుంచి మినహాయించడం, ఆ బ్యాలెన్స్ నిర్దిష్ట కనిష్ట పరిమితి దిగువకు చేరిన వెంటనే సంబంధిత అధికారులకు ఈ-మెయిల్/ఎస్ఎంఎస్ రూపంలో సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుంది. బ్యాలెన్స్ సున్నాకు చేరినపుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రీ-పెయిడ్ మీటర్లు:



ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్‌లోతేటి

ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలోని 9 జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం పట్ల జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీలు/కార్పొరేషన్లు, వాటర్ వరక్స్ తదితర ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల నుంచి రూ.9,507 కోట్ల బకాయిలను ఎపిఎస్పిడిసిఎల్ కు చెల్లించాల్సి వుంది. ఈ బకాయిల చెల్లింపు, భవిష్యత్తులో విద్యుత్తు వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం, విద్యుత్ బిల్లును ఆదా చేయడంతోపాటు విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకునేందుకు ప్రీ-పెయిడ్ మీటర్లు ఉపయోగపడుతాయి. మొబైల్ రీచార్జ్ తరహాలోనే ఈ-వాలెట్ ద్వారా ప్రీ-పెయిడ్ మీటర్లను రీచార్జ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

## పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- డిఇఓ,రాజేంద్రప్రసాద్

**చిత్తూరు మే 15మనం న్యూస్:** జిల్లాలో ఈనెలలో నిర్వహించనున్న ఎస్.ఎస్.సి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు,ఏపీఓఎస్ఎస్, ఎస్.ఎస్.సి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో గుర్తించబడిన పరీక్షా కేంద్రాలలో మే 25 నుండి జూన్ 4వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.భౌతిక శాస్త్రం,జీవశాస్త్రం పరీక్షలు ఉదయం 09.30 గంటల నుండి 11.30 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

**జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ సి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలు:**

జిల్లాలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. చిత్తూరు మండలంలో డా. వరదప్ప నాయుడు మున్సిపల్ హైస్కూల్, విజ్ఞాని దీప్తి హైస్కూల్, నారాయణ ఈఎంహెచ్ఎస్, శ్రీ చైతన్య ఈఎం హైస్కూల్, ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, కంఫర్ట్ ఈఎంహెచ్ఎస్, గండ్లపల్లె మున్సిపల్ హైస్కూల్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అలాగే ఎస్.ఆర్.పురం, బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, రామకుప్పం, రాళ్లబుడుగూరు, కుప్పం, పుంగనూరు, చౌడేపల్లె, కార్వేటినగరం, నగరి మరియు పులిచెర్ల మండలాల్లో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**ఏపీఓఎస్ఎస్ ఎస్ ఎస్ సి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలు:**

ఏపీఓఎస్ఎస్ ఎస్.ఎస్.సి సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 13 కేంద్రాలుఏర్పాటు చేయగా, చిత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం, పులిచెర్ల ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ఏపీఓఎస్ఎస్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం మొత్తం 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్తూరు, జి.డి.నెల్లూరు, నగరి, పలమనేరు, పుంగనూరు మరియు కుప్పం ప్రాంతాల్లో ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని, పరీక్షా నియమావళిని కచ్చితంగా పాటించాలని కోరారు. జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలకు పరీక్షల తేదీలు, సమయాలు మరియు కేంద్రాల వివరాలపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## 5వ విడత రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ ,ఈ-కేవైసీ పనులను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన

- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

**తిరుపతి మే 15 మనం న్యూస్:** సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో తడ మండలం పూడి గ్రామంలో జరుగుతున్న 5వ విడత రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ మరియు ఈ-కేవైసీ పనులను సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్ రెడ్డి తో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూ వివరాలు, సరిహద్దులు, రికార్డుల ధృవీకరణ వంటి అంశాలను అధికారులతో సమీక్షించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన కార్యక్రమమని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## గోమాతల పరిరక్షణలో దాతల సహకారం ప్రశంసనీయం

- టిటిడి జేఈవో డా. ఎ. శరత్
- అకాల వర్షాల నుండి ఎండుగడ్డిని సంరక్షించాలి

**తిరుపతి మే15 మనం న్యూస్:** టిటిడి ఎస్వీ గోశాలకు భక్తులు, దాతలు విరాళంగా అందించిన 180 లారీల ఎండుగడ్డిని అకాల వర్షాల నుండి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని టిటిడి జేఈవో (వైద్యం విద్య) డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో కలిసి ఎస్వీ గోశాలను పరిశీలించిన ఆయన, గోవుల సంరక్షణ, ఎండుగడ్డి నిల్వలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గోమాతల సేవలో భాగంగా ఎండుగడ్డి దానాన్ని అందించిన టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, నెహ్రూ ఫౌండేషన్, శ్రీనివాస సేవా ట్రస్ట్ ఛైర్మన్ టి. సత్యనారాయణలను జేఈవో ప్రత్యేకంగా అభినందించారు. గోసంరక్షణ మహోన్నతమైన ధార్మిక సేవ అని పేర్కొంటూ, గోవుల పరిరక్షణకు మరింత మంది దాతలు ముందుకు వస్తే టిటిడి



సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. గోశాలకు దానంగా వచ్చిన ఎండుగడ్డిని శాస్త్రీయ విధానంలో విభజించి నిల్వ చేయాలని, వర్షాల ప్రభావం లేకుండా టార్పాలిన్ కవర్లతో భద్రపరచాలని అధికారులకు సూచించారు. గోవులకు ఎటువంటి ఆహార కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిశీలన**

టిటిడి ఆధ్వర్యంలో స్వదేశీ ఆవుల జన్యు పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నిర్మాణంలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జేఈవో సూచించారు. సెంటర్ పూర్తయిన అనంతరం పాలు ఇచ్చే ఆవుల సంఖ్య, భవిష్యత్తులో అవసరమయ్యే పాల ఉత్పత్తి సామర్థ్యం, పాలు సేకరణ, నెయ్యి తయారీ, పెరుగు-మజ్జిగ పంపిణీ, మానవ వనరుల వినియోగం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పూర్తయితే ప్రతి షెడ్లో 250 ఆవుల సామర్థ్యంతో గోవులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. అలాగే గోవుల మేటర్నిటీ షెడ్, ఆధునిక మిల్కింగ్ పార్లర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, డిఈ దామోదర్, మేనేజర్లు మృదుల, గౌరీ, అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల నిర్మాణం కొరకు మాస్టర్ ప్లాన్




- కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి, మే 15 మనం న్యూస్:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికు వచ్చు భక్తుల సౌకర్యం కొరకు రాక పోకలు సజావుగా ఉండేలా ట్రాఫిక్ సమస్య తీర్చుట కొరకు మాస్టర్ ప్లాన్ లో భాగంగా తిరుచానూరు రోడ్డు విస్తరణ, పార్కింగ్ కు సంబంధించిన పనుల పై టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సి వి ఎస్ ఓ మురళి కృష్ణ తో కలిసి తుడా, టిటిడి వారు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్.. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు, సాధారణ రోజుల్లో కూడా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఎక్కువ శాతం భక్తులు దర్శించుకుంటారని తెలిపారు. అందులో భాగంగానే తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికు వచ్చు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు ఆలయ పరిసరాలలో రద్దీని తగ్గించేందుకు భక్తులకు మెరుగైన దర్శన అనుభూతి కలిగించేలా రోడ్డు నిర్మాణా, పార్కింగ్ పనులను చేపట్టాలని తెలిపారు. రోడ్డు నిర్మాణం, పార్కింగ్ పనులు చాలా ముఖ్యమైనవి అనీ ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తి కావాలన్నారు. టిటిడి జేఈవో, తుడా సిపిఓ రోడ్డు నిర్మాణం, పార్కింగ్ కు సంబంధించి సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ప్లాన్ గురించి జిల్లా కలెక్టర్ కు విపులంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ఏ డి సర్వేయర్ అరుణ్ కుమార్, సూపర్డెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఆర్ అండ్ బి ఎస్ ఈ సుధాకర్ నాయక్, తుడా ఎస్ఈ రవీంద్ర, తుడా సి పి ఓ దేవి , టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు, పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు

- వాహనసేవలతో పాటు భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించాలి
- జేఈవో వి. వీరబ్రహ్మం

**తిరుపతి(టిటిడి),మే 15,మనం న్యూస్:** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించాలని టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం ఆలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ మే 23న ధ్వజారోహణంతో ప్రారంభమై, మే 31న ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలకు రాజీలేని విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు వాహనసేవలతో పాటు మూలమూర్తి దర్శనం సైతం సాఫీగా కల్పించేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలంకరణలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా క్యూలైన్లు, చలువపందిళ్లు, కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.



విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో ఆలయం పరిసరాలను దేదీప్యమానంగా విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు ఆర్చీలు, కటౌట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలలో అవసరమైనంత మంది శ్రీవారి సేవకులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాలల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, వాహనసేవల ముందు భజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తాలని సూచించారు. అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా టిటిడి విజిలెన్స్, పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, విజివో గిరిధర్, ఏఈవో నారాయణ చౌదరి, అదనపు ఆరోగ్య అధికారి డా.సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.3లక్షల జరిమానా
- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి మే15 మనం న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 27/2019 కేసులో ఈ ముద్దాయి తిరుపతి-చెన్నై రోడ్ లోని గాజులమండ్యం జంక్షన్ వద్ద



అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, వేలూరు జిల్లా ఆర్కాట్ తాలూకా,మొస్సూర్ పాళ్యం గ్రామానికి చెందినవాడు, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ కులశేఖర్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

## పెట్రోలు కొనలేం.. ఇక మాకు సైకిలే దిక్కు



వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ

సైకిల్ తొక్కుతూ వినూత్న నిరసన తెలిపిన సిపిఎంనేతలు

**తిరుపతి. మే15 మనం న్యూస్:** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నేడు శుక్రవారం సాయంత్రం సిపిఎం కార్యాలయం నుంచి సుందరయ్య నగర్ సర్కిల్ వరకు వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెరుగుతున్న ఇంధన ధరలతో ఇక వాహనానికి పెట్రోలు కొనలేని పరిస్థితి వచ్చిందని, సామాన్యుడు బండి నడపడం భారంగా మారిందని తెలియజేస్తూ వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ, మరోవైపు సైకిల్ తొక్కుతూ నిరసన తెలిపారు. పెట్రోలు కొనలేం.. బండి నడపలేం, ఇక మాకు సైకిలే దిక్కు, ధరలు తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా ప్రజలపై భారాలు పెంచుతోందని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. రైతులు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, కార్మికులపై ఈ భారం తీవ్రంగా పడుతోందని తెలిపారు.

## చెరువు మట్టిని యదేచ్ఛగా దోచేస్తున్న మట్టి మాఫియా

- అధికారుల మౌనం వెనుక రాజకీయ అండా..? అవినీతి నీడలా..?
- అక్రమాలను బయటపెడుతున్న జర్నలిస్టులపై దౌర్జన్యాలు

**గంగాధర నెల్లూరు, మే-15 మనం న్యూస్:** వినాయకపురం - కార్వేటినగరం పరిధిలోని చినపబ్బనాయుడు కండ్రిగ సరిహద్దు చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు వ్యవహారం రోజురోజుకు తీవ్రమవుతోంది. గత మూడు రోజులుగా భారీ టిప్పర్లు, ట్రాక్టర్ల సహాయంతో రాత్రింబవళ్లు చెరువు మట్టిని యథేచ్ఛగాతరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లుగావ్యవహరిస్తుండటం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే చెరువు ప్రాంతంలో భారీ స్థాయిలో మట్టితవ్వకాలుకొనసాగుతున్నాయి. చెరువు భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేలా జరుగుతున్న ఈ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే ఈ చర్యలను అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం మౌనంగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది.రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజలను మరింత ఆవేదనకు గురిచేస్తోంది. ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు..? రాజకీయ అండదండలున్నాయా..? లేక అధికారులే అవినీతికి పాల్పడుతున్నారా..? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే ఈ అక్రమాలను వీడియోలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తున్న జర్నలిస్టులు, న్యూస్ ఛానళ్ల ప్రతినిధులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాణాలకు తెగించి ఆధారాలతో అక్రమాలను బయటపెడుతున్న మీడియాపై దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి మచ్చగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## రీ సర్వే తప్పులు జరగకుండా పారదర్శకంగా రీ సర్వే పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు మే 15మనం న్యూస్:** గ్రామాలలో జరిగే రీ సర్వేలో తప్పులు జరగకుండా పారదర్శకంగా రీ సర్వే పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబందితఅధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు పలమనేరు నియోజకవర్గానికి సంబందించిన పెద్దపంజాని, గంగవరం, బైరెడ్డిపల్లి, వీకోట, పలమనేర్ వివిధ మండలాలలో గ్రామాలకు సంబంధించిన రి సర్వే పై సమీక్షించారు, అనంతరం పెద్దపంజాణి మండలంలోనివీరప్పపల్లి, గనకొండ, బొమ్మరాజుపల్లి, కొల్లత్తురు, నెలపల్లి గ్రామాలకు సంబందించిన రీ సర్వే అమలు పై జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్, పలమనేరు ఆర్. డి. ఓ భవానీ, సర్వేయర్ డి. డి జయరాజ్, మండల సర్వేయర్లు, వి. ఆర్. ఓ లు తదితరులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల లోని భూ సమస్యలు పరిష్కరించడా లో మండల సర్వేయర్లు, వి ఆర్ ఓ లు ప్రముఖ పాత్ర పోషించాలని ఆదేశించారు. ఈ కేవైసీ యాప్ ద్వారా తప్పనిసరిగా చేయాలని గ్రామ సర్వేయర్లకు ఆదేశించారు.

గ్రామాలలో రాజకీయాలు పక్కన పెట్టి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పలమనేరు డివిజన్ నందు ప్రతి ఒక సర్వే నెంబర్లపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలని పలమనేర్ ఆర్ డి ఓ, డి ఐ ఓ ఎస్ ఆదేశించారు, వివిధ గ్రామాలలో జరిగే రీసెర్వే కార్యక్రమం ఆర్డీవో పర్యవేక్షణ కలిగి ఉండాలని ఆదేశించారు.వి. ఆర్. ఓ లాగిన్ సర్వేయర్ లాగిన్ఎప్పటికప్పుడు పరిశీలి ంచుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి. ఐ. ఓ. ఎస్ రమణా రెడ్డి, ఏ. డి పుల్లయ్య , ఆయా మండల సర్వేయర్లు రెవెన్యూ డిప్యూటీ తహశీల్దారులు ఆయా గ్రామాలకు సంబందించిన వి. ఆర్. ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## నవరసాల నవచైతన్యం

వెన్నెల వీణలు మీటగా
విరహమే వసంతమౌతుంది,
చూపుల చినుకులు జారగా
శృంగారం జయగీతమౌతుంది
చిరునవ్వు చిందినంతనే చీకటి చెదిరిపోతుంది
ముచ్చట్ల మధురిమలో
హాస్యం హరివిల్లౌతుంది
కన్నీటి తడి పలుకుల్లో
కరుణ కల్పవల్లౌతుంది,
పరబాధ పంచిన హృదయం
మానవత్వ దీపమౌతుంది
అన్యాయ చీకట్ల మధ్య
అగ్నిశిఖలా కోపం లేస్తుంది,
ధర్మరక్షణ దిక్సూచిగా
రౌద్రం రణభేరియౌతుంది
పర్వతమై కష్టం వచ్చినా
పడిపోని ధైర్యమే వీరత్వమౌతుంది,
పరాజయ బూడిదలోనూ
పరాక్రమ జ్యోతి వెలుగౌతుంది
చీకటి గాలి చప్పుడు కూడా
చిత్తాన్ని కంపింపజేస్తుంది,
జాగ్రత్త నేర్పే గురువై
భయానకం దీపమౌతుంది
కపటపు కలుషం చూసి
మనసు కలవరపడుతుంది,
మలినాలను దహింపజేసే
బీభత్సం బోధనౌతుంది
అణువులో విశ్వం చూసే
ఆశ్చర్యమే అద్భుతమౌతుంది,
పసినవ్వు పరిమళంలో
ఆనందదీపం వెలుగౌతుంది
అలజడి అలలు ఆగగా
ఆత్మసరోవరం నిర్మలమౌతుంది,
నిశ్శబ్ద నాదాల మధ్య
శాంతం శశిధారౌతుంది
నవరసాల నవనీతంతో
నరజీవితం నాట్యమాడుతుంది,
సుఖదుఃఖ రాగాల నడుమ
నవోన్మేషం జీవనకావ్యమౌతుంది

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

# సింగపూర్ విద్యావిధానం స్ఫూర్తిదాయకం



తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రాబోతున్నాయా అంటే అవుననే అంటున్నారు విద్యావేత్తలు,నిపుణులు. ఇప్పటికే కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కూడా నూతన విద్యా విధానం అమలు కాబోతోందా? అసలు విద్యా విధానం ఎలా ఉండ బోతోంది అనేది మేధావి వర్గంగా పిలవబడే ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఇతర దేశాల్లో అమలవుతున్న విద్యా విధానాలను పరిశీలించాలని నిపుణులైన ఉపాధ్యాయులు, అధికారుల బృందాన్ని ఇటీవలే ఫిన్లాండ్ దేశానికి పంపింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కూడా ఉపాధ్యాయుల బృందాన్ని సింగపూర్‌కు పంపినది. ఇతర దేశాల్లో అమలవుతున్న ఉపయోగ కరమైన విద్యా విధానాలను మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టాలనదే విద్యాశాఖ మంత్రి, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంకల్పంగా కనబడుతున్నది. రాబోయే రోజుల్లో మరి కొంత మంది ఉపాధ్యాయ బృందాన్ని జపాన్ వియత్నాం పంపే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నది. నేపథ్యంలో సింగపూర్ అమలవుతున్న విద్యా విధానాన్ని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఉపాధ్యాయుడికి ఉన్నది.

శిక్షణ,ఒత్తిడి లేని తరగతులు, క్రిటికల్ థింకింగ్,డిజిటల్ అక్షరాస్యత సింగపూర్ పాఠశాల విద్యావ్యవస్థ బలాలు.ఆ దేశంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల్లోనే చదవాలి. ప్రైవేటు స్కూళ్లలో చేరి చదువుకోవాలనుకుంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మాతృభాషను ఒక సబ్జెక్టుగా బోధిస్తారు. సింగపూర్లో మూడు సంవత్సరాల వయస్సు నుండి ప్రీ-స్కూల్ విద్యను, సుమారు ఏడు సంవత్సరాల వయస్సు నుండి ప్రాథమిక విద్యను అందిస్తారు.ప్రాథమిక పాఠశాల తర్వాత, పిల్లలు సెకండరీ పాఠశాలకు వెళ్తారు,ఇది సుమారు 12 నుండి 16 లేదా 17సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల కోసం ఉంటుంది. విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే, టీనేజర్లు రెండు లేదా మూడు సంవత్సరాల ప్రిపరేషన్ కోర్సుకు హాజరు కావాలి. ఇది ఐచ్ఛికం, మరియు ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

సింగపూర్‌లో ఆరేళ్ల వయస్సు నుండి ప్రాథమిక పాఠశాలకు హాజరు కావడం తప్పనిసరి. ఈ పాఠశాల విద్య ఉచితంగా అందించబడుతుంది మరియు దీనిని పాటించని తల్లిదండ్రులకు జరిమానాలు ఉంటాయి. మీరు మీ బిడ్డకు ఇంట్లోనే విద్యను అందించాలనుకుంటే, లేదా విద్యా మంత్రిత్వ శాఖచే నిర్వహించబడని మతసంస్థలో వారిని చేర్పించాలనుకుంటే, అందుకు మీరు అధికారుల నుండి అనుమతి కోసం దరఖాస్తు చేసు కోవాలి.

సింగపూర్‌లో సైన్యం, వైద్యం తర్వాత ఉపాధ్యాయ వృత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. నియామక ప్రక్రియ ఎంతో పకడ్బందీగా ఉంటుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టీచర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తారు. ఫలితంగా బోధనలో నాణ్యత పెరిగింది. పనితీరు ఆధారంగా ఉపాధ్యాయులకు గ్రేడింగ్ ఇస్తారు. పదోన్నతులకు ఆ గ్రేడింగే ప్రామాణికం. పదోన్నతి పొందాక ఆరు నెలలు శిక్షణ తప్పనిసరి. ప్రతి ఉపాధ్యా యుడూ ఏడాదికి వంద గంటలు తప్పనిసరిగా శిక్షణ పొందాల్సిందే.

ఉపాధ్యాయులు కేవలం ఫెసిలిటేటర్లుగానే ఉంటారు. విద్యార్థులకు తెలిసిన విషయాల ద్వారా వారిని సబ్జెక్టులోకి తీసుకువెళ్లే విధానంలో బోధన సాగుతోంది. ప్రాథమిక పాఠశాల ఆరవ తరగతి వరకు ఉంటుంది. దీనిని నాలుగు సంవత్సరాల పునాది కాలంగా, మరియు పిల్లలను మాధ్యమిక విద్యకు సిద్ధం చేయడానికి రెండు సంవత్సరాల 'పరిచయ కాలం'గా విభజించారు. ప్రాథమిక సంవత్సరాల ముఖ్య ఉద్దేశ్యం ఆంగ్ల భాష, స్థానిక మాతృభాష మరియు గణితంపై పట్టు సాధించడం. విద్యార్థులు ఈ ప్రధాన రంగాలకు మించి, తమ బలానికి తగిన సబ్జెక్టులను ఎంచుకోవచ్చు.

మాధ్యమిక విద్య యొక్క తప్పనిసరి దశ నాలుగు లేదా ఐదు సంవత్సరాల పాటు కొనసాగుతుంది.ఈ కాలం ముగింపులో, విద్యార్థులందరూ ఒక పరీక్ష రాస్తారు. అందులో మంచి స్కోరు సాధిస్తే ప్రీ-యూనివర్సిటీ విద్యను కొనసాగించడానికి ఎంచుకోవచ్చు. ప్రీ-యూనివర్సిటీ విద్య అనేది రెండు లేదా మూడు సంవత్సరాల కోర్సును కలిగి ఉంటుంది, ఇది విశ్వవిద్యాలయానికి హాజరు కావాలనుకునే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఉత్తమ సంస్థలలో, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించబడతాయి మరియు పోటీ చాలా తీవ్రంగా ఉంటుంది. మరిన్ని వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో, సాంకేతిక సంస్థ లేదా పాలిటెక్నిక్లో 'పోస్ట్-సెకండరీ' విద్యను కొనసాగించడం దీనికి ప్రత్యామ్నాయం. విద్యార్థులు ఎంచుకోగల అనేక రకాల విద్యాసంస్థలు ఉన్నాయి.

సింగపూర్ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విద్యా సంవత్సరం సెమిస్టర్లుగా విభజించబడింది. మొదటి సెమిస్టర్ సాధారణంగా జనవరి నుండి మే వరకు కొనసాగుతుంది, ఆ తర్వాత సెలవులు ఉంటాయి. అనంతరం జూలై నుండి రెండవ సెమిస్టర్ ప్రారంభమై, నవంబర్ మరియు డిసెంబర్లలో విరామంతో ముగుస్తుంది. ప్రతి సెమిస్టర్ మధ్యలో ఒక చిన్న విరామం కూడా ఉంటుంది.

డిజిటల్ లిటరసీలో సింగపూర్ ముందంజలో ఉంది. పిల్లలకు పరీక్షలు తగ్గించి, ఒత్తిడి లేకుండా చేశారు.టర్మ్‌లు పూర్తయ్యాక 10 రోజుల చొప్పున సెలవులు ఉంటాయి. టర్మ్ ఏ పాఠం ఎప్పుడైనా చెప్పొచ్చు. పూర్వ ప్రాథమిక విద్యలో నాణ్యమైన బోధనకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. పసితనంలోనే పిల్లలకు బలమైన పునాది వేస్తే ప్రాథమిక తరగతుల్లో ఇబ్బందులు ఉండవని భావిస్తారు.పిల్లలకు మార్కులు ఉండవు. గ్రేడ్లు ఇస్తారు. వెనుకబడిన విద్యార్థులను వదిలేయరు. ఏ సబ్జెక్టులో వెనుకబడ్డారో దానిపై ప్రత్యేక దృష్టిపెడతారు. ప్రతి ఒక్కరి వద్ద ల్యాప్‌టాప్ ఉంటుంది. పిల్లలే పీపీటీలు చేసి, తరగతిలో ప్రజంటేషన్ ఇస్తారు. డిజిటల్ లెర్నింగ్ కు ప్రాధాన్యం ఎక్కువ. ఇంటి దగ్గరా అభ్యసన కొనసాగుతుంది. 6-12 ఏళ్ల మధ్య ప్రాథమిక విద్య ఉంటుంది. తర్వాత పరీక్ష నిర్వహించి, గ్రేడ్ల ఆధారంగా సెకండరీ విద్యకు పంపిస్తారు.

సింగపూర్‌లో రూపొందించబడే అకడమిక్ క్యాలెండర్ కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తిస్తుందని గమనించాలి - ప్రైవేట్ మరియు అంతర్జాతీయ పాఠశాలల్లో, సుదీర్ఘ వేసవి సెలవులు మరియు క్రిస్మస్ సమయంలో అనేక వారాల సెలవులతో కూడిన పాశ్చాత్య ప్రామాణిక క్యాలెండర్‌ను అనుసరించే అవకాశం చాలా ఎక్కువగా ఉంది.

**- సుధాకర్.ఏ.వి**
9000674747



# నైతిక నాయకత్వం లేకపోతే?



చరిత్ర నిశ్శబ్దంగా ఒక భయానక సత్యాన్ని పలుకు తుంది. వ్యవస్థల పనితీరులో వచ్చే మార్పుల వెనుక నాయకత్వ స్థాయిలోని 'నిర్ణయాధికార కేంద్రీకరణ' ఒక ప్రాథమిక కారణం కావచ్చని పలువురు భావిస్తుం టారు. అధికారం బాధ్యత కంటే వ్యక్తిగత ప్రతిష్ఠకు ప్రాధాన్యతనిచ్చినప్పుడు, అది వ్యవస్థాగత సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

రాజ్యాంగాలు చట్టబద్ధమైన చట్టాన్ని అందిస్తే, వాటి అమలు స్వతంత్ర సంస్థల స్వయం ప్రతిపత్తిపై ఆధారపడి ఉంటుంది. నాయకత్వ వైఖరి వ్యవస్థాగత పరిమితులను దాటినప్పుడు, అది ప్రజాస్వామ్య పునాదులపై చూపే ప్రభావంపై అంతర్జాతీయ వేదికలపై నిరంతరం చర్చ సాగుతూనే ఉంటుంది.

ప్రపంచ చరిత్రలో అపరిమిత అధికార కేంద్రీకరణ, అది వ్యవస్థలపై చూపే ప్రభావం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయో గత శతాబ్దపు కొన్ని రాజకీయ పరిణామాలు ఉదాహరణలుగా నిలుస్తాయి. నేడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న సంఘటనలు కూడా ఇటువంటి ఆందోళనలను రేకెత్తిస్తున్నట్లు అంతర్జాతీయ సమాజం గమనిస్తోంది. పశ్చిమాసియా వంటి ఘర్షణ ప్రాంతాల్లో గణనీయమైన సంఖ్యలో ప్రాణ నష్టం నమోదైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

క్షేత్రస్థాయి పరిస్థితుల దృష్ట్యా ఈ గణాంకాలను స్వతంత్రంగా ధృవీకరించడం ప్రస్తుతం సవాలుగా మారింది. మృతుల్లో ఎక్కువ శాతం సామాన్య పౌరులే ఉన్నారనే అంశంపై ప్రపంచ వ్యాప్త చర్చ సాగుతోంది.

మరోవైపు, సంబంధిత దేశాలు ఈ చర్యలను తమ భద్రతా అవసరాలకు అనుగుణంగా జరిగిన ప్రతిస్పందనలుగా పేర్కొం టున్నాయి. భిన్నమైన వాదనల మధ్య మానవతా దృక్పథం, అంతర్జాతీయ ప్రమాణాల అమలుపై మేధావుల మధ్య లోతైన విశ్లేషణ జరుగుతోంది. అమెరికా వంటి దేశాల్లో గతంలో చోటుచేసుకున్న కొన్ని రాజకీయ సంఘటనలు కూడా ప్రజాస్వామ్య సంస్థలపై నాయకత్వ వైఖరి చూపే ప్రభావాన్ని సూచిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. అటు ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో అంతర్జాతీయ నిబంధనలు, దేశాల మధ్య భద్రతా ఆందోళనలకు సంబంధించిన భిన్నమైన దృక్కోణాలు నిరంతరం తెరపైకి వస్తున్నాయి.

నిర్ణయాధికారాల్లో ఉండే దృఢమైన వైఖరి, విస్తరణ కాంక్ష ప్రపంచ శాంతిపై ప్రభావం చూపుతున్నట్లు నేటి పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయి. గతంలో సంభవించిన యుద్ధాలు మిగిల్చిన శరణార్థి సంక్షోభం, వివిధ దేశాల్లో కనిపిస్తున్న రాజకీయ అస్థిరత అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక-సైనిక విస్తరణ విధానాలు, శక్తి సమీకరణాల్లో వస్తున్న మార్పులు భవిష్యత్తుపై అప్రమత్తతను పెంచుతున్నాయి. మేధస్సు, నిర్ణయాధికారాలు సామాజిక ప్రయోజనాలకు విరుద్ధమైన దిశలో పయనించినప్పుడు కలిగే నష్టంపై చారిత్రక విశ్లేషణలు ఉన్నాయి. ఉన్నత విద్యావంతులైన కొందరు వ్యక్తుల వైఖరి, నిర్దిష్ట సిద్ధాంతాలు ప్రపంచ శాంతికి సవాలుగా మారిన ఉదాహరణలు చరిత్రలో అనేకం ఉన్నాయి. వ్యక్తిగత ప్రతిష్ఠ, భావజాలం వ్యవస్థల కంటే గొప్పదని భావించినప్పుడు సంభవించే మానవతా సంక్షోభాలు నాయకత్వ బాధ్యతపై నిరంతరం చర్చను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో నాయకులు వ్యవహరించిన తీరుపై అంతర్జాతీయంగా వెలువడే అభిప్రాయాలు, నైతిక నాయకత్వ ప్రాధాన్యతను గుర్తుచేస్తున్నాయి.

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో గతంలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలు, రాజ్యాంగ హక్కుల పరిమితిపై ఒక గంభీరమైన పాఠంగా మిగిలిపోయాయి.

ప్రస్తుత ఆర్థిక గణాంకాలను పరిశీలిస్తే ఆందోళనకరమైన మార్పులు కనిపిస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాలతో కూడిన వివిధ నివేదికల ప్రకారం.. 2019 నుండి 2024 మధ్య కాలంలో భారతీయ కుటుంబాల అప్పుల నిష్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఉన్నట్లు సమాచారం. అలాగే కొన్ని ప్రాజెక్టుల అమలులో ముందస్తు ఆర్థిక అనుమతుల ప్రక్రియపై వస్తున్న గణాంకాలు వ్యవస్థాగత పర్యవేక్షణ అవసరాన్ని వెల్లడిస్తున్నాయి.

వివిధ రాష్ట్రాల్లోనూ పాలనా విధానాలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత నిర్ణయాధికారం కంటే వ్యవస్థల మధ్య ఉండాల్సిన సమతుల్యతకే ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

సామ్రాజ్యాల పతనానికి బాహ్య శత్రువుల కంటే అంతర్గత వ్యవస్థాగత బలహీనతలు, నిర్ణయాధికారాల్లో ఉండే లోపాలు ప్రధాన కారణాలుగా చరిత్రకారులు విశ్లేషిస్తుంటారు. చరిత్ర మిగిల్చిన ఆధారాలను, వివిధ అంతర్జాతీయ నివేదికలను, ప్రస్తుత సామాజిక-రాజకీయ పరిణామాలను గమనించినప్పుడు.. వ్యవస్థల కంటే వ్యక్తిగత ప్రతిష్ఠకే అధిక ప్రాధాన్యత ఇచ్చే ధోరణి అంతిమంగా ప్రజాస్వామ్యానికి సవాలుగా పరిణమించవచ్చనే అభిప్రాయం బలోపేతమవుతోంది.

అధికారం అనేది ప్రజలు అప్పగించిన పవిత్రమైన నమ్మకం. నాయకత్వం తన మేధస్సును వ్యవస్థల నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి వినియోగించినప్పుడే అది స్థిరమైన గుర్తింపును పొందుతుంది. వ్యక్తులు తాత్కాలికం, వ్యవస్థలే శాశ్వతం అనే మూలసూత్రాన్ని ప్రామాణికంగా తీసుకోనప్పుడు సంక్షోభాలు మొదలయ్యే అవకాశం ఉంటుంది.

చరిత్ర వ్యక్తుల పేర్ల కంటే ఆయా నిర్ణయాల వల్ల సమాజంపై పడిన ప్రభావాలనే ఎక్కువగా గుర్తుంచుకుంటుంది. చివరికి మిగిలేది అధికార వైభవం కాదు. మానవీయ విలువల పరిరక్షణే.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

# సమాజం సవాళ్లు ..బాధ్యతలు



ఆధునిక మానవుడు సాంకేతిక శిఖరాలను అధిరోహిస్తున్నాడు. అరచేతిలో ప్రపంచం. అంగార కుడిపైకి అడుగులు పడుతున్నాయి. కానీ, మరోవైపు మన కంటి ముందే సమాజం పల్చబడుతోంది. పర్యావరణ వినాశనం, సామాజిక వివక్ష, నైతిక విలువల పతనం వంటి సమస్యలు మౌనంగా మన పునాదులను తొలిచేస్తున్నాయి. ప్రగతి అంటే భవనాల నిర్మాణం కాదు. పచ్చని ప్రకృతితో కూడిన ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం అని మనం గుర్తించాల్సిన సమయం ఆసన్న మైంది.



నేడు మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి.... అన్నీ కలుషితమే. ముఖ్యంగా ప్లాస్టిక్ మహమ్మారి మన భూమిని శ్మశానంగా మారుస్తోంది. ఏటా ప్రపంచవ్యాప్తంగా సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి, అందులో కేవలం 9% మాత్రమే రీసైకిల్ అవుతోంది. వాతావరణ మార్పుల వల్ల అకాల వర్షాలు, తీవ్రమైన ఎండలు మనల్ని హెచ్చరిస్తున్నాయి. జల సంరక్షణ కోసం ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు, చెరువుల పునరుద్ధరణ తప్పనిసరి. ప్లాస్టిక్ బదులు జనపనార సంచులు, మట్టి పాత్రల వాడకాన్ని ఒక జీవనశైలిగా మార్చుకోవాలి. మహిళా సాధికారత అంటే కేవలం ఉద్యోగం చేయడం కాదు, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం పొందడం. నేడు మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్నారు, సొంతంగా స్టార్టప్‌లు పెట్టి పారి శ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు. అయితే, క్షేత్ర స్థాయిలో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయి. పని ప్రదేశాల్లో భద్రత (POSH Act) వంటి చట్టాలపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన కొరవడింది.

నేటి డిజిటల్ యుగంలో సైబర్ వేధింపులు మహిళలకు పెద్ద ముప్పుగా మారాయి. చట్టపరమైన రక్షణలతో పాటు, బాలికలకు ఆత్మరక్షణ విద్య, సమానత్వ భావనను చిన్నప్పటి నుండే నేర్పించాలి. ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళకు నిజమైన గౌరవం లభిస్తుంది. ఒకవైపు అభివృద్ధి గురించి మాట్లాడుకుంటూనే, మరోవైపు బాల్య వివాహాలు వంటి దురాచారాలు ఇంకా కొనసాగడం సిగ్గుచేటు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, అవగాహన లేమి వల్ల బాల్యం చితికిపోతోంది. దీనికి తోడు, నేటి యువతను మాదకద్రవ్యాల అలవాటు పట్టి పీడిస్తోంది. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వల్ల ఎంతోమంది మేధావులు, విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

మరో బాధాకరమైన విషయం ఏమిటంటే వృద్ధుల సమస్యలు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై, 'న్యూక్లియర్' ఫ్యామిలీలు పెరగడంతో వృద్ధులు ఒంటరితనం అనుభవిస్తున్నారు. సంపాదించే శక్తి ఉన్నంతకాలం చూసి, ఆ తర్వాత వారిని వృద్ధాశ్రమాలకు పంపడం సమాజ నైతిక పతనానికి నిదర్శనం. ప్రస్తుత సమాజం ఒక సంధి కాలంలో ఉంది. ఏఐ వంటి సాంకేతికతలు వస్తున్న తరుణంలో, మనం మానవత్వాన్ని మర్చిపో కూడదు. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన ప్రాథమిక కర్తవ్యం. మహిళలకు రక్షణ ఉన్నచోటే అభివృద్ధి సాధ్యం. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, వృద్ధులను గౌరవించే సంస్కృతిని పునరుద్ధరించుకోవాలి.

ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయి, కానీ మార్పు మన ఇంటి నుండే మొదలవ్వాలి. స్వచ్ఛమైన గాలి, సమానత్వంతో కూడిన సమాజం, వ్యసన రహిత యువత ఉన్నప్పుడే మనం రేపటి తరానికి నిజమైన సంపదను అందించిన వాళ్లమవుతాం. మేల్కొందాం.. మార్పు వైపు అడుగు వేద్దాం!

**- కాళేశ్వరం కృష్ణమూర్తి**
9705196097

# పుట్టపర్తిలో ఆధునిక డయాలసిస్ సెంటర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఈ డయాలసిస్ సెంటర్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు.

అనంతరం సుమారు 7.4 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న క్యాన్సర్ కేర్ మరియు ప్యాలియేటివ్ కేర్ సెంటర్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఆధునిక సదుపాయాలతో రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన అభినందించారు.

సేవా దృక్పథంతో ముందుకు వస్తున్న సంస్థలు సమాజానికి ఆదర్శమని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, వైద్యులు, సేవా సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

# పసిడి ప్రియులకు ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ప్రకారం శుక్రవారం (మే 15) ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,240 తగ్గి రూ.1,60,090 వద్దకు చేరింది. ఇక, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.2,050 తగ్గి రూ.1,46,750 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.10,000 కోత పడటంతో ప్రస్తుతం రూ.3.05 లక్షల వద్ద కొనసాగింది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,60,090గా ఉండగా, ఢిల్లీలో రూ.1,60,240గా ఉంది. చెన్నైలో మాత్రం కాస్త ఎక్కువగా రూ.1,63,390 వద్ద ట్రేడవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ కిలో వెండి ధర రూ.3.05 లక్షల వద్దనే కొనసాగుతోంది. నిన్న, మొన్నటితో పోలిస్తే దేశవ్యాప్తంగా పసిడి, వెండి ధరల్లో భారీ తగ్గుదల నమోదైంది.

## భారీగా పతనమైన రూ. మారకపు విలువ

**ఢిల్లీ, మే 15 :** అమెరికా డాలర్ తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యాహ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది.

రూపాయి విలువ పతనమైతే.. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదవుతాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నతవిద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.

# వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్

(మొదటి పేజీ తరువాయి)

నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి.

**రీ ఎగ్జామ్‌లో మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తలు..**

ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దు. పరీక్ష రద్దు కారణంగా కలిగిన అంతరాయాన్ని, ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని రీటెస్ట్ సమయంలో విద్యార్థులకు 15 నిమిషాల అదనపు సమయం ఇవ్వనున్నాం'' అని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

## నీట్ నిందితుడి ఇంట గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీట్లు..!

**జైపూర్ ,మే 15 :** నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయటపడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తోంది. దీంతో ఈ ఏడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరి ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది ప్రభుత్వ కాలేజీల్లో వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది.

**అందరికీ అత్తెసరు మార్కులే.. అయినా మేజిక్..!**

వికాస్‌కు పదో తరగతిలో 63%, 12వ తరగతిలో 55% మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69%, 12వ తరగతిలో 91% మార్కులు వచ్చాయి. 2024 నీట్లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320- 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63%, 12వ తరగతిలో 89% మార్కులు వచ్చాయి. 2024 నీట్లో 320 మార్కులతో సరిపెట్టుకొంది.

# పిజిఆర్ఎస్ పూర్తి అయ్యేంతవరకు అధికారులందరు విధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు
- పిజిఆర్ఎస్ కు - 62 అర్జీలు.
- రెవిన్యూ క్లినిక్ - 41 అర్జీలు.
- జిల్లా కలెక్టర్ నిషాంతి. టి



ఏ ఎస్ ఆర్ జిల్లా (పాడేరు), మే : 15, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్ ) కు 62 వినతులు, రెవెన్యూ క్లినిక్ 41 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ , ఐటిడిఏ పివో ఆదిత్య వర్మ, డిఆర్వో (ఎఫ్ ఏ సి )ఎమ్ వి ఎస్ లోకేశ్వరరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల వినతులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్జీదారులకు తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారులందరూ, ఆయా శాఖ పరమైన సమగ్ర సమాచారంతో హాజరుకావాలని, పిజిఆర్ఎస్ అయ్యేంతవరకు అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన యెడలవారి పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పి జి ఆర్ ఎస్ లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని అప్లికేషన్ తీసుకొని సమస్యను నమోదును కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారులు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని, ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో తక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు వస్తారని , అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని, తద్వారా అర్జీదారుని పరిష్కారం వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించినట్లయితే ఐ వి ఆర్ ఎస్ ప్రగతి లో ఉంటుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరికి జిల్లా అధికారుల అర్జీదారుని సమస్యపై పూర్తి అవగాహన తెచ్చుకుని వివరాలు ఇవ్వాలన్నారు. మండల తాసిల్దార్, ఎంపీడీవో, మండలానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది సమస్యలపై వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు.

గ్రీవెన్స్ లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి ఖ్ఖుజ్ఞూట్చుర్ఘు.చఇఃజౌరి.జీ్ఞ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు ఖచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు.

# గంజాయి రవాణా నిందితుడికి 2 ఏళ్ల 7 నెలల జైలు శిక్ష జరిమానా

- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి (మాకవరపాలెం), మే 15 మనం న్యూస్ : అనకాపల్లి జిల్లా మాకవరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి న్యాయస్థానం కఠిన శిక్ష విధించింది. విశాఖపట్నం 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ నేరం నిరూపితమైన నిందితుడికి 02 సంవత్సరాల 07 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు₹5,000/- జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో, అదనంగా మరో నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పుష్పరాజ్ (విల్లవంకోడ్, కన్యాకుమారి జిల్లా, తమిళనాడు రాష్ట్రం.) 2023 నవంబర్ 8న అప్పటి మాకవరపాలెం ఎస్సై పి.రామకృష్ణ రావు తమ సిబ్బందితో కలిసి పైడిపాల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పోలీసులను చూసి తప్పించుకోబోతున్న నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకోగా, వారి వద్ద 07 కిలోల గంజాయి లభ్యమైంది. ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయిని తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.ఈ కేసులో అప్పటి ఎస్సై పి.రామకృష్ణ రావు సమగ్ర విచారణ చేపట్టగా, ప్రస్తుత సబ్-ఇన్స్పెక్టర్ డి.దామోదర్ నాయుడు పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించి నేరాన్ని నిరూపించారు.ఈ తీర్పుపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, హర్షం వ్యక్తం చేశారు. గంజాయి సాగు, రవాణాపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని, ఈ శిక్ష నిందితుల్లో భయాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. కేసును ప్రతిభావంతంగా దర్యాప్తు చేసిన ఎస్సైలు పి.రామకృష్ణ రావు, డి.దామోదర్ నాయుడు లను, వాదనలు వినిపించిన ఏపీపీని, మాకవరపాలెం పోలీస్ సిబ్బందిని మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# దుర్గంధం సమస్యకు శాశ్వత పరిష్కారం



- గంటా ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ఆనందపురం: మనం న్యూస్:మే, 15: తాళ్లవలస పంచాయతీ పరిధిలోని రాయనిపేట చెరువు దుర్గంధ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల టాయ్ లెట్ల నుంచి వ్యర్థాలను పైపుల ద్వారా చెరువులోకి వదిలేయడం ప్రజల నుంచి వ్యతిరేకతకు కారణమైంది. స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఆ విషయం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి వెళ్లింది. సమస్య తీవ్రత నేపథ్యంలో తక్షణ పరిష్కార చర్యలకు ఆదేశించడంతో భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. చెరువులో దుర్గంధాన్ని వెంటనే తొలగించాలని అధికారులతో చెప్పారు. దీంతో పొక్లెన్, పైపు ద్వారా మురుగు తొలగించే పనులను శుక్రవారం నుంచి మొదలుపెట్టారు. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో తొందర్లోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొంటామని విజయ్ బాబు చెప్పారు. చెరువులోకి టాయ్ లెట్ వ్యర్థాలను వదలడంతో స్థానిక ప్రజలు అనారోగ్యం పాలవుతున్న విషయాన్ని ఎమ్మెల్యే గంటా తీవ్రంగా పరిగణిస్తున్నారని తెలిపారు.

# సింహాచలం దేవస్థానం నూతన పాలకమండలి నియామకం

విశాఖపట్నం, మే 15 మనం న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ విడుదల చేసిన జీవో. ఆర్టి. నంబర్. 754 ప్రకారం ఈ నియామకాలు జరిగాయి.పాలకమండలి వివరాలు:చైర్మన్: శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజు (విజయనగరం).సభ్యుల సంఖ్య: మొత్తం 17 మంది సభ్యులతో కూడిన బోర్డును ప్రభుత్వం ఖరారు చేసింది.పదవీ కాలం: బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి రెండేళ్ల పాటు ఈ కమిటీ అధికారంలో ఉంటుంది.ముఖ్య సభ్యులు మరియు వారి నియోజకవర్గాలు:

**పాలకమండలిలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులకు చోటు కల్పించారు:**

మాకేన సీతారాం పాత్రుడు (నవీన్) - శృంగవరపుకోట
కాసిరెడ్డి దామోధర్ - భీమిలి
చలమరి భారతి - భీమిలి
కరక దేవుడు - పెందుర్తి
కనకాల మురళీమోహన్ - విజయనగరం
వంపడాపు అన్నపూర్ణ - చీపురుపల్లి
బీతల నీరజ లక్ష్మీ కుమారి - అరకు వ్యాలీ (ఎస్ టి)మధూపడ సన్యాసి రావు - విశాఖపట్నం
డాక్టర్ శ్రీ ధరణి బండ్ల - నరసరావుపేట
నీటిపల్లి మహేష్ - పెందుర్తి
పెద్దిశెట్టి ఉషశ్రీ - విశాఖపట్నం
లలిత జ్యోతి - పుంగనూరు
గుత్తికొండ శ్రీలత - విశాఖ ఉత్తర
సుసరాపు గణపతి రావు - టెక్కలి
చల్లంగి జ్ఞానేశ్వరి - పాడేరు (ఎస్టి)
పావులూరి శ్రీనివాసరావు - అనపర్తివీరితో పాటు దేవస్థాన ప్రధాన అర్చకులు ఎక్స్-అఫీషియో మెంబర్గా వ్యవహరిస్తారు.ప్రమాణ స్వీకారం:

నూతనంగా నియమితులైన సభ్యులతో దేవాదాయ శాఖ కమిషనర్ నిబంధనల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయించవలసిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్తర్వులను గవర్నర్ పేరు మీదుగా ప్రభుత్వ ఎక్స్-అఫీషియో కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్ జారీ చేశారు.

# స్కిల్ గేమ్ పేరుతో గిరిజనులకు మోసం



- లక్షలాది రూపాయలు దోచుకుంటున్నసూట్ బాల్.
- పోలీస్ శాఖ ఉత్సవ కమిటీ అండదండలతో దోపిడి..
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి
- కూడా సురేష్ కుమార్ (స్కిల్ గేమ్)సూట్ బాల్ నిలుపుదల చేయాలనిడిమాండ్

పాడేరు ,మే 15 మనం న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో రాష్ట్ర గిరిజన జాతర మోదకొండమ్మ ఉత్సవాలు మూడు రోజులపాటు అతి వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దేశ నలుమూలల నుండి అనేకమంది భక్తులు సందర్శకులు తరలివచ్చి జాతర మూడు రోజులు తిలకించి అమ్మవారిని ప్రత్యేక పూజలు చేసుకుంటారు. ఇదే అదునుగా చూసుకుని ప్రతి ఏడాది స్కిల్ గేమ్ పేరిట సూట్ బాల్ జూద గేమ్ బహిరంగంగా వేలాది రూపాయలు కాపు కాసి గేమ్ నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు పోలీస్ శాఖకు ఉత్సవ కమిటీకి ఒప్పందం ఏర్పరచుకొని అధికారికంగా బహిరంగంగా ఈ గేమ్ నిర్వహించడం గమనార్హం...!ఇది స్కిల్ గేమ్ కాదని జూదమని అనేకమంది నిపుణులు మేధావులు చెబుతున్నప్పటికీ మాకు కోర్టు అనుమతి ఉంది పోలీస్ అనుమతులు ఉన్నాయని అమాయక ప్రజలను దోచుకొనే పరిస్థితి నెలకొంది. దీనిని అడ్డుకట్ట వేసే పోలీస్ అధికారులే వత్తాసు పలకడంతో ఇష్ట రాజ్యాంగ ఈ జూదాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. గతంలో పోలీస్ శాఖ ఉన్నత అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఇటువంటి జూదాలను నిషేధించారు. ప్రస్తుత అధికారులు ఉత్సవ కమిటీ ఏకమై ఈ జూద నిర్వహణ దారుల వద్ద లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని అమాయక ప్రజలను దోచుకోమని అప్పగించిన చందంగా ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ జూదాల వల్ల ఈ మూడు రోజులపాటు ఉత్సవాలను ఆనందంగా గడపాలని వచ్చిన కుటుంబాలు డబ్బులు పోగొట్టుకొని నిరాశగా తిరిగి వెళ్లే పరిస్థితి నెలకొంది. దీనిపై అవగాహన కలిగి ప్రజలు ఈ జూదానికి దూరంగా ఉండాలని పోలీస్ అధికారులు స్పందించి వెంటనే నిలుపుదల చేయాలని పలువురు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి సూట్ బాల్ మోసపూరిత గేమ్ ను నిలుపుదల చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలు ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని కూడా. సురేష్ కుమార్ హెచ్చరించారు.

# ఆకాశవాణి అలనాటి మధుర భావ గీతాలు

- ఆహూతుల సమక్షం లో విరబూసిన సంగీత స్వరాలు
- 90 వసంతాల జాతీయోత్సవాల్లో వెల్లి విరిసిన రసతంత్రులు



విశాఖపట్నం, మే 15: ప్రసారభారతి ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం శుక్రవారం సాయంత్రం కళాభారతి ప్రాంగణంలో నిర్వహించిన అలనాటి మధుర గీతాలు ఆద్యంతం మాధుర్యాన్ని పంచాయి. డా.ద్వారం వికెజి త్యాగరాజ్ సంగీత నిర్వహణలో 90 వసంతాల ఆకాశవాణి జాతీయోత్సవాల్లో భాగంగా ఏర్పాటైన అలనాటి మధుర భావ గీతాలు మధురానుభూతిని పంచాయి. వందేమాతరం గీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో అదిగదిగో అదే అదే..( కృష్ణ శాస్త్రి ), వెన్నెలేమో పంపింది.. (ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గీతం) ను పవన్ కుమార్ చరణ్, సురభి శ్రావణి పాడారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.హర్షలత మాట్లాడుతూ ఆకాశవాణి ప్రస్థానాన్ని వివరించారు. విజ్ఞానం వినోదంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సేవలందిస్తోం దన్నారు. ఎఫ్ఎం ప్రారంభం తరువాత ప్రాచుర్యంలోకి వచ్చి ఎన్నో సేవలతో ముందుకు వెళుతున్నా మన్నారు. ప్రధాని మోదీ ఆకాశవాణిలో మనసులో మాటగా ప్రజలకు చేరువ చేస్తున్నా రన్నారు. డైరెక్టర్ ఇంజనీరింగ్ జె.కృష్ణారావు మాట్లాడుతూ రాజమండ్రి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నంలతో పాటు ఏజెన్సీ చింతపల్లి, విజయనగరం, సింహాచలం ప్రాంతాల నుండి కూడా నాణ్యమైన కార్యక్రమాలు ఎఫ్.ఎం ల ద్వారా త్వరలో అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. న్యూస్ ఆన్ ఎయిర్ ద్వారా కూడా మరింత సేవలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమ విభాగాధిపతి పివి రామ్ గోపాల్ మాట్లాడుతూ ఆలిండియా రేడియో గా ఉన్న వ్యవస్థ ఆకాశవాణిగా మారడంతో 1952లో తీసుకున్న నిర్ణయంతో లలిత సంగీతం ప్రారంభం అయ్యిందన్నారు. 1957 లో మొదలైన వివిధ భారతి కాలక్రమంలో చోటు చేసుకున్న మార్పులు వివరించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఆకాశవాణి అందరిదీ అన్నారు. ఆకాశవాణి 90 వసంతాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనంద దాయక మన్నారు. ఆకాశవాణి అంటే నిబద్ధతకు మారు పేరు అన్న ఆయన ఎప్పటికీ ఆకాశవాణి సమయ పాలన నిర్దిష్టమైన దన్నారు. ఇదే వేదికపై జీవీఎంసీ అదనపు కమిషనర్ నల్లనయ్య, ద్వారం త్యాగరాజు లను ఉచిత రీతిన సత్కరించారు. ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్ రాంభట్ల నృసింహ శర్మ మాస్టర్ ఆఫ్ శర్మనీ గా వ్యవహరించిన కార్యక్రమంలో, సహాయ సంచాలకులు కె.ఇందిర, కార్యక్రమ నిర్వహణ అధికారులు సంఘమిత్ర, సుధాకర రెడ్డి, దిలీప్ కుమార్ రెడ్డి తదితరులు సారథ్యం వహించారు.

# ఉల్లంఘనలపై కిరాణా హోల్సేల్ దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లకు జరిమానా విధించిన జె.సి.విద్యాధరి.



విశాఖ పట్నం, మే 15: నగరంలో ఆహార భద్రతా నియమాలు ఉల్లంఘించిన పలు కిరాణా హోల్ సేల్ దుకాణాలు, హోటళ్ళు, రెస్టారెంట్లు, వాటర్ ప్లాంట్లపై విశాఖ జాయింట్ కలెక్టర్ విద్యాధరి కన్నెర్ర చేశారు. ఆమె వీటిపై 6.5లక్షల రూపాయల మేర జరిమానా విధించి మళ్ళీ తప్పిదాలు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని గట్టిగా హెచ్చరించారు. ఎఫ్ఎస్ఎస్ 2006 చట్టం ప్రకారం విశాఖలోని 12 సంస్థలపై ఈ జరిమానాలు విధించి మరో వాటర్ ప్లాంట్ లైసెన్సు రద్దు చేశారు. నాణ్యత లేని ధాన్యాలు, పప్పులు, ఆహార ఉత్పత్తుల అమ్మకం, కృత్రిమ ఆహార రంగుల్ని వినియోగించడం, చికెన్ లాలిపాప్, ఫ్రైల్లో నాణ్యత లేని పదార్థాలు వాడటం, పాడై పోయిన, గడువు ముగిసిన పానీయాలు, ఆహార వస్తువుల్ని విక్రయించడం తదితర ఉల్లంఘనలపై ఆమె సీరియస్ అయ్యారు. ఇంకొక సారి ఇటువంటి తప్పిదాలు జరిగితే లైసెన్స్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకోవాలని ఆహార భద్రతాధి కారులను ఆమె ఆదేశించారు. విశాఖ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కల్యాణ చక్రవర్తి, ఆహార భద్రతా అధికారి జీవీ అప్పారావు నమోదు చేసిన పలు కేసులపై ఆమె శుక్రవారం తన కార్యాలయంలో సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# అప్పన్నస్వామిని దర్శించుకున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి




సింహాచలం మే 15 మనం న్యూస్ :శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానాన్ని శృంగవరపుకోట (ఎస్.కోట) శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి, వారి దంపతులు కుటుంబ సభ్యులు శుక్రవారం సందర్శించారు.ఆలయానికి విచ్చేసిన శాసనసభ్యురాలి కుటుంబానికి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు ఆదేశాల మేరకు ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి ఏ త్రిమూర్తులు, ఆలయ పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరరావు మరియు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.దర్శనంలో భాగంగా కోళ్ల లలిత కుమారి దంపతులు మొదటగా ఆలయంలో అత్యంత మహిమాన్వితమైన 'కప్పస్తంభమును' ఆలింగనం చేసుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం గర్భాలయంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు వారికి మంత్రపుష్పాలతో వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి శేష వస్త్రాన్ని కప్పి ఘనంగా సత్కరించారు. స్వామివారి పవిత్ర ప్రసాదాలతో పాటు, జ్ఞాపికగా శ్రీవారి దివ్య సుందర చిత్రపటాన్ని వారికి అందజేశారు.

# 20న. ఔషధ దుకాణాల బంద్..!



ఆనందపురం: మనం న్యూస్ :మే15 ఔషధ దుకాణాలు మే 20న బంద్ నిర్వహించనున్నాయి. ఆన్లైన్ ద్వారా జరుగుతున్న ఔషధాల విక్రయాలకు నిరసనగా ఈ బంద్కు దేశంలోని ఔషధ వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ బంద్లో భాగంగా సుమారు 12 లక్షలకుపైగా ఔషధ దుకాణాలు ఒకరోజు పాటు మూతపడనున్నట్లు వ్యాపార వర్గాలు వెల్లడించాయి.ఇటీవల కాలంలో ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయి. వైద్యుల సూచనలు లేకుండానే అనేక రకాల మందులు ప్రజలకు అందుబాటులోకి రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా నిషేధిత మరియు నియంత్రిత మందులు కూడా సులభంగా విక్రయించబడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇది ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఔషధాలు కొనుగోలు చేసే సమయంలో వైద్యుల సూచనలు అత్యంత ముఖ్యమని, కానీ ఆన్లైన్ విక్రయాల్లో ఈ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. వైద్యుల చీటీ లేకుండానే మందులు అందించడం వల్ల ప్రజలు స్వయంగా మందులు వాడే పరిస్థితి పెరుగుతోందని, దీని వల్ల ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.మరోవైపు భారీ రాయితీల పేరుతో చిన్నచిన్న ఔషధ దుకాణాల వ్యాపారం దెబ్బతింటోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర సమయంలో సేవలు అందిస్తున్న చిన్న దుకాణాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పెద్ద సంస్థలు తక్కువ ధరలకు మందులు విక్రయించడం వల్ల చిన్న వ్యాపారులు పోటీ పడలేక నష్టపోతున్నారని అంటున్నారు. దేశవ్యాప్తంగా ఔషధ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉపాధిపై ఈ పరిస్థితి ప్రభావం చూపుతోందని సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆన్లైన్ ద్వారా జరిగే ఔషధ విక్రయాలపై కఠిన నియంత్రణలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చట్టాలకు విరుద్ధంగా మందుల విక్రయం జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ బంద్ కారణంగా మే 20న అనేక ప్రాంతాల్లో ఔషధ దుకాణాలు మూతపడే అవకాశం ఉంది. అయితే అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు కలగకుండా కొన్ని ప్రాంతాల్లో అత్యవసర మందుల సరఫరా కొనసాగించే అవకాశం ఉందని సమాచారం. ప్రజలు అవసరమైన మందులను ముందుగానే కొనుగోలు చేసుకోవాలని వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి.

# కేంద్ర బీమా పథకాలతో కుటుంబాలకు ఆర్థిక భరోసా




- బ్యాంకు మేనేజర్ దుర్గారావు
- ఇండియన్ బ్యాంక్ పోడూరు శాఖలో అవగాహన కార్యక్రమం, లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవై పథకాలలో చేరాలని ప్రజలకు సూచన

**పోడూరు మే 15 మనం న్యూస్ :** పోడూరు మండలంలోని ఇండియన్ బ్యాంక్ పోడూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. బ్యాంకు శాఖ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ బొంతు దుర్గారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలలో నమోదు చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన పితాని శ్రీను కుటుంబానికి రూ.4 లక్షల చెక్కును, ఆకస్మిక మరణానికి గురైన కుడిపూడి నాగ సత్యనారాయణ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ కరస్పాండెంట్ (బీసీ) దొంగ పాండురంగ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) కింద సంవత్సరానికి రూ.436 చెల్లించి 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వారు చేరవచ్చని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్బీవై)లో సంవత్సరానికి రూ.20 చెల్లించి 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వారు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ రెండు పథకాల ద్వారా సహజ మరణానికి కుటుంబాలకు రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకాలపై విస్తృత అవగాహన కల్పిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న శాఖ మేనేజర్ బొంతు దుర్గారావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ గుడాల సత్యనారాయ స్వామి, అటెండర్ మీసాల పుల్లారావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# కవిటం పాఠశాలలో కిషోరులకు ఆరోగ్య విజ్ఞాన బోధన



**పోడూరు మే 15 మనం న్యూస్ :** పోడూరు మండలం కవిటం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిషోరీ వికాసం సమ్మర్ క్యాలెండర్-2026లో భాగంగా సెషన్-5 కింద లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం మరియు హెచ్ఐవి/ఎయిడ్స్ అంశాలపై బాలికలు, బాలురకు వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి డి. శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ కె.మోహనరాణి కిషోర్ వికాసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలను విద్యార్థులకు వివరించారు.అనంతరం ఆరోగ్యశాఖ సిబ్బంది లైంగిక సంబంధాల ద్వారా సంక్రమించే వ్యాధులు (ఎస్టీఐలు), వాటి ప్రభావాలు, హెచ్ఐవి వైరస్ రోగనిరోధక వ్యవస్థపై చూపే ప్రభావం, ఎయిడ్స్కు దారితీసే పరిస్థితులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి రక్త మార్పిడి, అసురక్షిత లైంగిక సంబంధాలు, గర్భధారణ సమయంలో లేదా తల్లి పాల ద్వారా శిశువులకు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. అలాగే హెచ్ఐవి/ఎయిడ్స్ లక్షణాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ యూనిట్ సంస్థాగత సేవల రక్షణ అధికారి పి. మమతాశ్రీ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చైల్ హెల్ప్లైన్-1098, బాలల హక్కులు, బాల్య వివాహ నిషేధ చట్టం-2006, పోక్సో చట్టం-2012 అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తూ, చదువుపై శ్రద్ధతో పాటు తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోనలో కాటన్ జయంతి

**కాట్రేనికోన మే 15 మనం ప్రతినిధి** అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ 223వ జయంతి ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాట్రేనికోనలోని పాత తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోదావరి జిల్లాలకు కాటన్ మహాశయుడు చేసిన సేవలను కొనియాడారు. మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఓగూరు భాగ్యశ్రీ, పి ఎస్ఎన్ రాజు,బండారు ఏసు, గుబ్బల మణేశ్వరరావు, నల్ల రామకృష్ణ, సుంకర బుజ్జి, కముజు రాంబాబు, గువ్వాల సత్తిబాబు, వాసంశెట్టి రాజేశ్వరరావు, జంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# బాధితునికి వైసిపి నేత రమణారావు ఆర్థిక సాయం




**అమలాపురం: మే 15 మనం న్యూస్** అయినవిల్లి మండలం జై భీమ్ నగర్, తొత్తరమూడి పంచాయతీకి చెందిన దేవరపల్లి వెంకటేష్ (తండ్రి: వీర రాఘవులు) పెరాలసిస్తో తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు గురువారం వెంకటేష్ను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన రమణారావుకు వెంకటేష్ మరియు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుంచె రమేష్ (రాముడు), దేవరపల్లి పల్లవి, మట్ట జాన్సన్, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్, కుంచె అర్జున్, విప్పర్తి రమేష్, అరిగెల చంటి తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ రతనాల సీమ... ఇది చరిత్ర



- ఉద్యాన సీమ... ఇది వర్తమానం.
- రక్షణ సీమ... ఇది భవిష్యత్
- చంద్రన్న పరిపాలన లో రాయలసీమ అభివృద్ధి పరుగులు పెడుతుంది:యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి నరసింహ యాదవ్

**తిరుపతి మే15 మనం న్యూస్:** పుట్టపర్తిలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అడ్వాన్స్డ్ మీడియం కాంబాట్ ఎయిర్క్రాఫ్ట్ (ఎయంసిఎ) డిఫెన్స్ ప్రాజెక్టుకు శుక్రవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు భూమి పూజ చేశారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు.. రాయలసీమ ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న పుట్టపర్తిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేసి అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో వెనుకబడిన ప్రాంతం అయినా రాయలసీమలోని అనంతపురం జిల్లా పుట్టపర్తిలో రక్షణ శాఖకు సంబంధించిన ఏ డి ఏ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం భూమి పూజ చేయడం గర్వకారణం అన్నారు.దీనికి సంబంధించి సాంకేతికను ఉంచుకొని 350 ఎకరాల్లో ఏరో క్రాఫ్ట్ సంబంధించి 15800 కోట్ల రూపాయలని అక్కడ నిర్మాణానికి వెచ్చించారు, 7500 మంది ఉద్యోగ అవకాశాలు అక్కడ కల్పించే విధంగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని నరసింహ యాదవ్ అన్నారు. ప్రధానంగా యుద్ధానికి సంబంధించిన చారిత్రాత్మకమైన ఎయిర్ క్రాఫ్ట్ సంబంధించిన తయారీ ఫ్యాక్టరీలో అక్కడికి రావడం రాయలసీమలో అనేక పరిశ్రమల స్థాపనకు చంద్రబాబునాయుడు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నారు రాయల్ ఎన్ఫీల్ ఉత్పత్తి దీనికి సంబంధించి తిరుపతి కేంద్రంగా కూడా ఇక్కడ వచ్చే విధంగా నిర్ణయాలు చేయడం జరిగిందన్నారు. కృష్ణా జలాల్ని రాయలసీమ కి మళ్లించిన చరిత్ర చంద్రబాబుది అన్నారు.

# నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన



**ముమ్మిడివరం, మే 15,మనం న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ముమ్మిడివరం నగర పంచాయతి కార్యాలయం వద్ద శుక్రవారం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్ అధ్యక్షతన నిరసన ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి అయోగ్ చెప్పిన డైరెక్షన్లో ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న వర్క్ అవుట్ సోర్సింగ్ ప్రైవేటు వాహనాల కాంట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వడానికి నిర్ణయించిన విధానంపై నగర పంచాయతి అవుట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన చేపట్టారు. దీని పర్యవసానంగా డ్రైవర్లు, క్లీనర్లు మరియు మెకానిక్లు ఉపాధి కోల్పోతారని, శాశ్వత ప్రాతిపదికన బానిసలుగా పని చేయాల్సి వస్తుందని ఈ చర్యలను వ్యతిరేకిస్తూ ఎటువంటి పోరా టానికైనా సిద్ధమని తెలిపారు.

# సర్ ఆర్థర్ కాటన్ ఆశయాల బాటలో రైతులు నడవాలి

- మాజీ ఎమ్మెల్సీ అంగర

**పాలకొల్లు, మే 15,మనం ప్రతి నిధి** రైతాంగమంతా సర్ ఆర్థర్ కాటన్ ఆశయాల బాటలో నడవాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. పాలకొల్లులో ఇరిగేషన్ ఏఈ కార్యాలయ ప్రాంగణంలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సర్ ఆర్థర్ కాటన్ 266వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అందరు మాట్లాడుతూ ధవలేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కాటన్ మహాసేయుడని పేర్కొన్నారు. ఆయన చేసిన మేలువల్లనే నేడు ఉభయ గోదావరి జిల్లాలో పాడిపంటలు సస్యశ్యామలంగా మారడంతో పాటు దాహార్తిని తీర్చుకోగలుగుతున్నామన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు, నాగరికత అభివృద్ధి చెందడానికి కాటన్ పుణ్యమే అన్నారు. పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు పెనుమత్స రాంభద్రరాజు మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో



ప్రతి ఎకరానికి సాగునీర్ అంది అధిక దిగుబడులు సాధించడానికి మంత్రి నిమ్మల రామానాయుడు కృషి అని అన్నారు. డెల్టా ఆధునీకరణకు మంత్రి రామానాయుడు కృషి చేస్తున్నారంటూ ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ది తెలిపారు. ఈ కార్య్ర కమంలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు,పెన్మెత్స రాంభద్రరాజు, ఆరుమిల్లి రామ శ్రీనివాస్, ఇంటి శ్రీరాములు, పులఖండం వీర రాఘవులు,మాతా రత్నం రాజు, జక్కంపూడి కుమార్, పాముల రజనీ కుమార్, దేవళ్ల శ్రీరామ కోటి మోహన్, సెడగం సురేంద్ర, గోపి, చిట్టూరి సీతారామాంజనేయులు, బందెల భాస్కరరావు, కాపిశెట్టి జయరాం, ఇరిగేషన్ డిఈ వెంకటనారాయణ, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 516 జాతీయ రహదారి పనులపై జేసీ అపూర్వ భరత్ పరిశీలన



**యు. కొత్తపల్లి మే 15 ( మనం న్యూస్)** కాకినాడ పోర్టును జాతీయ రహదారులతో అనుసంధానం చేసే సాగరమాల ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న 516 జాతీయ రహదారి పనులను జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.మొదట కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, అనంతరం యు.కొత్తపల్లి మండలంలోని మూలపేట, పొన్నాడ గ్రామాల్లో పర్యటించి భూ యజమానులతో మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సాగరమాల ప్రాజెక్టు ద్వారా కాకినాడ పోర్టుకు మెరుగైన రహదారి అనుసంధానం కలగడంతో సరుకు రవాణా వేగవంతం అవుతుందని, పరిశ్రమలకు మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందన్నారు.ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, నిర్మాణ పనుల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా భూ యజమానులు సహకరించాలని కోరిన ఆయన, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఏఐ అధికారులు, కాకినాడ రూరల్ మరియు యు.కొత్తపల్లి మండల తహశీల్దార్లు ఎల్ఎస్ఎన్ కుమారి, చిన్నారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు దాటినా సెన్సస్ డ్యూటీ ముసుగులో తిష్ట వేస్తున్న అధికారులు

- ప్రజా ఖంఠకులుగా మారుతున్న వైనం

**పాలకొల్లు, మే 15,మనం ప్రతి నిధి** ఒకే గ్రామంలో ఐదేళ్లు దాటినా సెన్సెస్ డ్యూటీ పేరుతో కొందరు అధికారులు తిష్ట వేస్తున్నారు. కొందరు అధికారులు ఐదేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తూ కొన్ని అవకతవకలకు పాల్పడు తున్నట్లు ప్రచారం జరుగుతుంది. 5ఏళ్ళు ఒకేచోట ఉండటంతో అక్కడ పట్టు సాధించి ప్రజలను వేధిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి అధికారులు వల్ల కూటమి ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇటువంటి అక్రమార్కులకు ఎన్నికల కమిషన్ సెన్సెస్ డ్యూటీ ఒక వరంగా మారిందని పలువురు చెబుతున్నారు. ఈ డ్యూటీని అడ్డం పెట్టుకొని ఆ గ్రామం గాని, మండలం గాని కదలకుండా తిష్ట వేసి డబ్బులు సంపాదించుకోవడానికి బంగారు బాటగా ఎంచుకుంటున్నారని ఆరోపణలు వెళ్ళు వెతుతున్నాయి.

ఇలాంటి వారు కొన్ని డిపార్ట్మెంట్ ల లో వున్నారని సమాచారం.కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన, ఐదేళ్లు దాటిని డ్యూటీ ఒకే గ్రామం గాని, మండలంలో గాని చేస్తున్న ఉద్యోగిని సెన్సెస్ డ్యూటీ నుంచి తప్పించి తక్షణమే బదిలీ చేయాలని, ప్రజలును కాపాడాలని కోరుతున్నారు.

# ఆయుధ కర్మాగార నిర్మాణ ఆలోచనను ఉపసంహరించుకున్న ఎంపీ పుట్టా మహేష్ యాదవ్



**కొయ్యలగూడెం మే 15 మనం ప్రతినిధి:** కొయ్యలగూడెం మండలంలో నేవీ ఆయుధ కర్మగారాన్ని ఉపసంహరించుకున్న ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అలాగే రైతు సంఘ నాయకులు పుట్టా మహేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు ఈ సందర్భంగా కొయ్యలగూడెం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడుతూ సిపిఐ పోరాట ఫలితమే నేవీ ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని ఉపసంహరించు కోవడమని ఆయన అన్నారు.నేవీ ఆయుధ కర్మాగారంపై కొన్ని నెలలుగా సుదీర్ఘ పోరాటం చేయడం జరిగింది. ఆయుధ కర్మాగారానికి కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదనీ ఈ దేశానికి ఆయుధ కర్మాగారం అవసరం కానీ ఈ ప్రాంత రైతులు చిన్న సన్న కారు రైతులు ఈ ప్రాంతంలో పెద్ద రైతులు ఎవరూ లేరు ఎకరం రెండు ఎకరాలు ఉన్న రైతులు ఈ పొలాల మీదే వాళ్లకి జీవన ఆధారమని నేవీ ఆయుధ కర్మాగారం ఉపసంహరించుకున్నామని ఎంపీ పుట్ట మహేష్ గారు నిన్న మీడియా ముందు చెప్పడంతో మంగపతిదేవిపేట,బోడుగూడెం, బర్కిట్ నగర్ మిగిలిన గ్రామాలలో చిన్న సన్న కారు రైతులు ఆనందంతో పండగ వాతావరణం నెలకొందనీ ఆయన అన్నారు.త్వరలో రైతులు పుట్టా మహేష్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తామని ఆంజనేయ రాజు తెలియజేశారు.

# 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**పెనుగొండ, మే 15 మనం న్యూస్ :** శ్రీ శ్రీ కళావేదిక మరియు చైతన్య సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 6, 7తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పోస్టర్ ను గోవాలో ఘనంగా ఆవిష్కరించారు పనాజీలో ఇన్ కమ్ టాక్స్ ఆఫీస్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐటీ ఇన్స్పెక్టర్ చెల్లుబోయిన భరత్ మరియు వారి సిబ్బంది పాల్గొని సభల పోస్టర్ ను ఆవిష్కరించారు కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక జాతీయ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి సభల కోఆర్డినేటర్ డాక్టర్ సాదే బాలచందర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే లక్ష్యంతో ఈ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలను నిర్వహిస్తున్నామని..దేశ విదేశాల నుంచి కవులు రచయితలు కళాకారులు సాహితీ వేత్తలు ఈ మహా సభలకు హాజరుకానున్నారని.. తెలుగు సాహిత్యానికి ఇది ఒక మహోత్సవ వేదికగా నిలువనుందని ఆయన తెలిపారు..ఈ సభల వివరముల కొరకు 9440893462 నెంబర్ కు కాల్ చేసి సంప్రదించవచ్చని డాక్టర్ బాలచందర్ తెలియజేశారు..



# 6నెలలు గా జీతాలు రాక పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు




**పాలకొల్లు, మే 15,మనం ప్రతి నిధి** ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు రాక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల ఏప్రిల్ 2వ తేదీతో రాష్ట్రవ్యాప్తంగా 13, 321 పంచాయతీలలో సర్పంచులు పదవులు ముగిసిన విషయం తెలిసిందే. వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించారు. వారికి చెక్కు పవర్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీంతో సిబ్బందికి జీతాలు ఆలస్యం అవుతుందని, అప్పులు చేసి బ్రతకాల్సి వస్తోందని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే చెక్ పవర్ కూడా నేరుగా ఇవ్వకుండా డీఎల్పిఓ లాగిన్ ద్వారా జీవితంలు చేసి, నేరుగా సిబ్బంది అకౌంట్లో లోనే వేయాల్సి రావడం, ఇబ్బందికరంగా మారిందని పలువురు అంటున్నారు. ఇక జీతాలు వరకు చెల్లిస్తే, శానిటేషన్, మంచినీరు, డ్రైనేజ్ నిర్వహణ తదితర బిల్లులు ఇంకా చెల్లించకపోవడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లు వెత్తు తున్నాయి. కొందరు గ్రామ కార్యదర్శి లు కూడా అప్పులు చేసి వడ్డీలకు తెచ్చి, గ్రామ అభివృద్ధి కోసం పెట్టుబడులు పెట్టినా చెల్లింపులకు నోచుకోక పో వడం దురదృష్టకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు పెట్టుబడులు పెట్టిన మాజీ సర్పంచులు కూడా గ్రామ కార్యదర్శులు పై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులు గురి చేస్తున్నట్లు సమాచారం. దీంతో స్పెషల్ ఆఫీసర్లు వచ్చాక డబ్బులు వస్తాయనుకున్న గ్రామపంచాయతీ పెట్టుబడిదారులు ఆశపై ఆశలపై నీళ్లు చెల్లినట్లు అయింది. కూటమి ప్రభుత్వంలో గ్రామ కార్యదర్శులకు, సిబ్బందికి ఇబ్బందులు తప్పుతాయనుకున్నప్పటికీ ఏమాత్రం తప్ప లేదని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున గ్రామపంచాయతీలో జీతాలతో పాటు, అన్ని బిల్లులు చెల్లించి ఆదుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు ని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరుతున్నారు.

# కిర్లంపూడిలో ఎన్రోల్మెంట్ డ్రైవ్కు విశేష స్పందన

**కిర్లంపూడి మే 15:( మనం న్యూస్ ):** కిర్లంపూడి మండలంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్రోల్మెంట్ డ్రైవ్కు విశేష స్పందన లభించింది. తల్లిదండ్రులతో మాట్లాడిన అధికారులు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. జగపతినగరం పరిధిలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు దాదాపు 10 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.



# నూతన విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



**అల్లవరం మే 15 మనం న్యూస్ ప్రతినిధి:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా 'డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు బాబు జగజ్జీవన్ రామ్ నూతన విగ్రహాల ఆవిష్కరణ ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆవిష్కరించారు. మేళతాళాలతో,తీన్మార్ డప్పులతో, డిజేలతో, భారీ బాణాసంచా పేలుడులతో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ , ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ చైర్మన్ మరియు ఓ ఎన్ జి సి జనరల్ మేనేజర్ కొమ్ము సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేసి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కొమ్ము సత్యనారాయణ , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ బొమ్మి ఇజ్రాయిల్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు దుస్సాలువా,పూలదండలతో సత్కరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్అభిమానులు, బాబు జగజ్జీవన్ రామ్ గారి అభిమానులు, దళిత సంఘాల నాయకులు, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల పెద్దలు, గోడి గ్రామ బొమ్మి వారి పేట యువత, మహిళలు, పెద్దలు భారీ స్థాయిలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాయితీ పై వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తులు

**శంఖవరం మే 15 మనం ప్రతినిధి :** మండలంలోని రైతులు రాయితీ పై వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. ట్రాక్టర్,పవర్ టిల్లర్,నూర్పిడి యంత్రం,రోటోవేటర్,మినీ మిల్లులు, వివిధ రకాల స్ప్రేయర్లు,గడ్డి కోసే యంత్రాలు, ట్రాక్టర్ దుక్కి పనిముట్లు వంటి వాటికోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి ఈ నెల 19 తేదీలోపు తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

# కేడర్‌ను గుండెల్లో పెట్టుకొని చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేదే



వాళ్ల లేకపోతే మనం లేము, మన పదవులు కూడా లేవు!
ఎమ్మెల్యే దగ్గుపాటికి నారా లోకేష్ సూచన.
కూటమి మధ్య చిచ్చుపెట్టేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు.
11సీట్లకు పరిమితం చేసినా వైసిపి నాయకుల బుద్ధి మారలేదు.
పనిచేసిన కార్యకర్తలను శాస్త్రీయంగా గుర్తిస్తాం, పదవులిస్తాం.
అనంతపురం టి.డి.పి కార్యకర్తల సమావేశంలో యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్.

**అనంతపురం. మే 15 మనం న్యూస్ ప్రతినిధి.** అనంతపురం ఎమ్మెల్యేకి చెబుతున్నా, కార్యకర్తలు ఐదేళ్లు ఎన్నో కష్టాలు పడ్డారు,పాదయాత్రలో తనకు అండగా నిలబడింది ప్రాణసమానమైన కార్యకర్తలేనని వారందరినీ గుండెల్లో పెట్టుకుని కాపాడాల్సిన బాధ్యత మీపై ఉందని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిని ఉద్దేశించి అన్నారు. అనంతపురంలోని శ్రీనగర్ కాలనీలో గురువారం రాత్రి జరిగిన టి. డి. పి కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్ మాట్లాడుతూ... కార్యకర్తలు లేకపోతే మీరు, నేను లేము. పదవుల్లో ఎవరూ శాశ్వతం కాదు, పనితీరు సరిగా లేకపోతే చంద్రబాబు పీకి పడేస్తారన్నారు. క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ తీసుకుని కరెక్టు చేసుకుని ముందుకు వెళ్తున్నారన్నారు.. ఇప్పటికే చాలావరకు కార్పోరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ఇంకా ఇవ్వాల్సినవి ఉన్నాయన్నారు.. పద్ధతి ప్రకారం న్యాయం చేస్తూ ముందుకెళ్తున్నామన్నారు. మనమధ్య సోషల్ మీడియాలో చిచ్చుపెట్టేందుకు గొడ్డలి పార్టీ ఫేక్ వాళ్లు ప్రయత్నిస్తారని,కనుక పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండాలన్నారు.. కడపలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేందుకు వైసిపి సైకోలు కుట్రపన్నారన్నారు.వారి చరిత్ర తెలుసు కనుకనే ఎవరూ స్పందించలేదన్నారు.. సొంత బాబాయిని లేపేసి నారాసుర రక్తచరిత్రయని ప్రచారం చేశారన్నారు. దానివల్ల మనం తీవ్రంగా నష్టపోయామన్నారు.. ట్రైనింగ్ కు వచ్చినపుడు మీలో చాలామందిని తాను కలిశానని, కాఫీకబుర్లలో క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకుని సరిచేసుకుంటూ వెళ్తున్నానన్నారు.ఇంకా సమస్యలున్నాయన్నారు. సమస్యలు పరిష్కరించే దిశగా తాము ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యకర్తల కష్టం వల్లే మనకు అధికారం. తాము మంత్రిపదవుల్లో కూర్చోవడం వెనుక కార్యకర్తల కష్టం, త్యాగం దాగి ఉన్నాయన్నారు. 2019 -24 నడుమ వేలాదిమంది కార్యకర్తలపై కేసులు పెట్టారని,ఇబ్బందులు పెట్టారన్నారు.ఏకంగా చంద్రబాబు ఇంటి గేటుకు తాళ్లుకట్టారన్నారు.ఎంత వేధింపులకు గురిచేసినా ఎత్తిన పసుపుజెండా దించకుండా పోరాడింది తమ పార్టీ కార్యకర్తలేనని అన్నారు.ఆనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యకర్తలతో చర్చించానని అన్నారు.. అధికారంతో సంబంధం లేకుండా కార్యకర్తలు తమ కుటుంబంపై ఎప్పుడూ ప్రేమ, అభిమానం చూపుతానే ఉన్నారన్నారు. ఎన్టీఆర్ ను మూడుసార్లు గెలిపించింది, తన మామ హరికృష్ణను శాసనసభకు పంపింది, మరో మామ బాలయ్యను మూడుసార్లు శాసనసభకు పంపిన గడ్డ అనంతపురం జిల్లాయేనని అన్నారు.. అందుకే ఎంతచేసిన కార్యకర్తల రుణం తీరనిదన్నారు . కార్యకర్తల కోసం తాను అహర్నిశలు కష్టపడతానన్నారు. అనంతపురం జిల్లాను నెం.1 చేసే బాధ్యత తాను తీసుకుంటానని నారా లోకేష్ అన్నారు . అనంతపురం ప్రజలు కష్టాన్ని నమ్ముకునేవారని, చంద్రబాబు హార్టికల్చర్ కు మారమంటే వెంటనే అనంత రైతులు మారారని,ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని లోకేష్ అన్నారు. సామాన్యులను సైతం పొలిట్ బ్యూరోకి తెచ్చాం. మహానాడులో ఆరు శాసనాలు తీసుకున్నానని అందులో తన హృదయానికి దగ్గరైంది కార్యకర్తేనని అన్నారు.వైకాపా మూకలు బెదిరిస్తున్నా మీసాలు మెలిపెట్టి నామినేషన్ వేసిన అంజిరెడ్డి తాత, జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు విడిచిన తోట చంద్రయ్య ధైర్యం మనందరికీ ఆదర్శమన్నారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టే కార్యకర్తలే మన బలమని నారా లోకేష్ పేర్కొన్నారు. గతపాలనలో ఎంతోమంది కార్యకర్తలను చంపారు, అంతకుముందు పరిటాల రవిని కూడా హతమార్చారన్నారు.. ఎన్నికష్టాలు ఎదురైనా మీరు పార్టీకి అండగా నిలబడ్డారని, అందుకే టిడిపిలో కార్యకర్తే పార్టీ అధినేతయని, కష్టపడి కేడర్ ను గుర్తించేందుకే టెక్నాలజీతో అనుసంధానం చేస్తున్నామన్నారు.

సామాన్య కార్యకర్తను పొలిట్ బ్యూరోకి తీసుకెళ్లిన ఘనత మన తెలుగుదేశం పార్టీదన్నారు.. మండల పార్టీ అధ్యక్షురాలు, క్లస్టర్ ఇన్ చార్జిని పొలిట్ బ్యూరో సభ్యులను చేశామని ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు.

# మే 22న వేము ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో భారీ జాబ్ మేళా



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, మే 15 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ,జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ వేము ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించబోయే జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోనే ఆయన చాంబర్ లో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీ,వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న ఉద్యోగార్థులను గుర్తించి, వారికి ఈ సమాచారాన్ని చేరవేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 40కి పైగా ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయి.10వ తరగతి నుండి డిగ్రీ (పాస్/ఫెయిల్) వరకు చదివిన వారు అర్హులు.18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుష అభ్యర్థులు హాజరు కావచ్చు. వేము ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కొత్తకోట,లో జరుగును.ఈ గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఉపాధి నైపుణ్యాధికారిణి పద్మజ , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గుణశేఖర్ రెడ్డి ,వేము కళాశాల ప్రతినిధులు స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# మండల విద్యాశాఖలో ఆకస్మిక తనిఖీలు

**శంఖవరం మే 15 మనం ప్రతినిధి :** కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ శంఖవరం లో గల విద్యాశాఖ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శంఖవరం మండలం ఎన్రోల్మెంట్ డ్రైవ్, లో భాగంగా 1వ తరగతి మరియు 6వ తరగతి ప్రవేశాలు, డ్రాప్ ఔట్స్ గురించి వివరములు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పాఠశాలల యొక్క 1వ తరగతి టార్గెట్ 376 గాను 172 మందిని మండలం లో ఎన్రోల్మెంట్ డ్రైవ్లో నమోదు చేయడం జరిగిందని, మిగిలిన వారికి వెంటనే ప్రవేశాలు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్. ఆర్. కె.వి.ఎం స్టాక్ పాయింట్ ను సందర్శించి మండలానికి వచ్చిన టెక్స్టుబుక్స్ 18598 ను పరిశీలించడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ తెలిపారు. ఆయన వెంట డిసిఇబి సెక్రటరీ వెంకటరావు మండల విద్యాశాఖాధికారి-2 తామాడ గోవింద , శంఖవరం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బి.జగ్గారావు, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్ కసిరెడ్డి నాగరాజు ఉన్నారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు అండగా మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం అర్బన్ మే 15, మనం న్యూస్** ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి మరియు ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ మరోసారి మానవత్వాన్ని చాటిచెప్పారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలోలబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 49 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.23 లక్షల 44 వేల 467 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న అనేక కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఊరటనిచ్చింది. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలుస్తోందనే నమ్మకాన్ని ఈ సహాయ కార్యక్రమం మరింత బలపరిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. చెక్కులు అందుకున్న పలువురు లబ్ధిదారులు తమ కుటుంబ పరిస్థితిని వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. సరైన సమయంలో ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమకు ప్రాణాధారంగా మారిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ గారికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదన్నారు. వైద్య చికిత్సల కోసం ఎవరూ ఆర్థిక ఇబ్బందులతో వెనుకబడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి మరియు వైద్య అనుమతి పత్రాల ద్వారా ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు రూ.8 కోట్ల 92 లక్షల 55 వేల 501 రూపాయల మేర ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. శుక్రవారం పంపిణీ చేసిన రూ.23 లక్షల 44 వేల 467 రూపాయలతో కలిపి మొత్తం రూ.9 కోట్ల 15 లక్షల 99 వేల 968 రూపాయల మేర ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అందించామని వెల్లడించారు.ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక భారతీయ జనతా పార్టీ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, వివిధ విభాగాల ప్రతినిధులు, ఎన్డీఏ నాయకులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త పాడేమోసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి,మే15మనంన్యూస్:**-తలుపుల మండలం, నూతనకాలువ గ్రామం కి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వల్లెపు చక్రపాణి దురదృష్టవశాత్తు ఆక్సిడెంట్ జరిగి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ ఎన్నో కార్యక్రమాలల్లో పాల్గొనడం జరిగింది. చక్రపాణి మన మధ్య లేకపోవడం పార్టీకి మరియు వారి కుటుంబానికి తీరని లోటు. పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలియజేసి తుది వీడ్కోలు పలుకుతూ అత్యక్రియంలో శుక్రవారం పాల్గొన్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మరియు టీడీపీ కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సామాజిక, ఆర్థికంగా ముందుకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం

- చెంచుల జీవనోపాధి అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం
- మల్లాపూర్ చెంచుకుంటలో 34 కుటుంబాలతో కలెక్టర్ ముఖాముఖి సమావేశం
- తక్షణమే మౌలిక వసతులను కల్పించాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్....

**ఉమ్మడి మహ బూబ్ నగర్ మే 15 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ జిల్లాలోని ఉంటున్నటువంటి ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ)ను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీసిన కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న చెంచు కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీజీఐఎల్పీ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చాలని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునే కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి వారి సామర్థ్యాలు, ఆసక్తులను ఆధారంగా చేసుకుని ప్రత్యేక



జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్నచిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులకు ఆదేశించారు. చెంచు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మళ్లీ ఈ నెల 20వ. తేదీన చెంచు పెంటకు సందర్శిస్తానన్నారు. అప్పటివరకు వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కలెక్టర్ కోరారు. మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించి, బ్యాంకు లింకేజీలు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలన్నారు. గిరిజన యువతకు



నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మల్లాపూర్ పెంటలో మౌలిక వసతుల కొరతపై చెంచు పెంటలో గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత పథకాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రయోజనాలు అందకుండా ఎవరూ మిగలకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయిలో వుంటున్న చెంచుల వైపు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమేనని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మ అంటే పవిత్రత... తెలంగాణ శ్రీనివాస్ నాయక్



**నర్సంపేట మే 15 న్యూస్** వివిధ కార్యక్రమంలో భాగంగా వర్ధిల్లి రమ, వర్ధల్లికట్టయ్య వారి యొక్క దశదినకర్మ కార్యక్రమంలో సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత , నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ హాజరై ప్రగాఢ సానుభూతి, శ్రద్ధాంజలి, జోహార్లు అర్పిస్తూ మాట్లాడారు.... హిందూ సంప్రదాయాలలో దశదినకర్మకు ప్రత్యేక స్థానం ఉందని పరమపదించిన వ్యక్తులకు శాంతి చేకూర్చడంతోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తో పాటు వారి ఇంటికి పవిత్రత చేకూరేలా ముక్కోటి దేవతలు ఆశీర్వదిస్తారని అన్నారు... ఆ సర్వోన్నతుడు కర్మ ఫలాన్ని బట్టి దశదిశలు మార్చే మహోన్నతుడని ప్రతి ఒక్క నిమిత్తమాత్రుడనని అందుకే దశదినకర్మ పవిత్రత అని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో వర్దల్లి రాజు గౌడ్, రంజిత్ గౌడ్, చంద్రమోహన్ గౌడ్, కర్ణాకర్ గౌడ్, శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# పెన్షన్ మంజూరుపై ముఖ గుర్తింపు

**భీమదేవరపల్లి, మే 15 మనం న్యూస్:** పెన్షన్ దారుల ముఖ గుర్తింపు తోనే ధ్రువీకరణ జరుగుతుందని ఎంపీడీవో వీరేశం తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న వృద్ధాప్య, దివ్యాంగ, పెన్షన్లు తప్పుదోవ పట్టకుండా ఉండే ఒదుకు ముఖ గుర్తింపు తో ధ్రువీకరణ చేసి గ్రామాలలో ఉన్న గ్రామ కార్యదర్శి ముఖ లక్షణాలను కెమెరా ద్వారా స్కాన్ చేసి ధ్రువీకరిస్తారనితెలిపారు.

# 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎడ్యుకేషన్ వీక్

**మహాదేవపూర్, మే 15మనం న్యూస్ :** మహాదేవపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ మహదేవపూర్ బాలికల మరియు బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులఆధ్వర్యంలో గ్రంథాలయదినోత్సవం సంయుక్తంగా, ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో పుస్తక ప్రదర్శన మరియు విద్యార్థినీ విద్యార్థులచే పుస్తక పఠనం జరిగినది ఇట్టి కార్యక్రమంలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులుఅనిల్ కుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్లవిద్యార్థుల మేదస్సు పెరుగుతుందని, వారి యొక్క సమగ్రఅభివృద్ధికితోడ్పడుతుందని అన్నారు. బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో ఊహాశక్తి ,



సృజనాత్మకతపెంపొందుతుందని తెలియజేశారు. పాఠశాల గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు క్రమం తప్పకుండా చదివితే పాఠ్యాంశాలు కూడా సులువుగా అర్థమవుతాయని అన్నారు. బాలికల పాఠశాల గ్రంథాలయ ఇన్చార్జ్ ఉపాధ్యాయురాలు జనగామ రజిత మాట్లాడుతూ నిశ్శబ్దంగా పుస్తకాలు ఎక్కువగా చదివే విద్యార్థులు భవిష్యత్తులో సగర్వంగా తలెత్తుకొని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో బాలికల మరియు బాలుర పాఠశాలల ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి,మడక మధు, వీరేశం,ప్రసూన, పిడి రమేష్, ఐఈడి ఆర్ పినరేష్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి, బీ ఆర్ఎస్, పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరడం జరిగింది

**వరంగల్ జిల్లా మే 15 న్యూస్** సెంగెం మండలం పెద్ద తండా గ్రామంలో మన ప్రియతమా నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మరియు మండల్ సమన్వయ కమిటీ సభ్యులు ఆదేశాలమేరకు డిసిసి ఎస్టీ సెల్ చైర్మన్ , సర్పంచ్, ఉప సర్పంచ్ గుగులోత్ వినోదరవీందర్ నాయక్ ఆధ్వర్యంలో గుగులోతు రవి, కేవుల గుగులోతు రవి, రాములు తదితరులు బిజెపి / బీ ఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. గ్రామ



అభివృద్ధి మరియు ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, శ్రీకాంత్, నితీష్, రాకేష్, అనిల్, బిక్షపతి, చక్రు, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.



# వన్డే వరల్డ్‌కప్ ఆడటంపై కోహ్లి కీలక వ్యాఖ్యలు



భారత బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లి.. వన్డే వరల్డ్ కప్-2027 టోర్నీలో ఆడతాడా? లేదా?.. చాన్నాళ్లుగా క్రికెట్ వర్గాల్లో ఈ చర్చ నడుస్తోంది. 'సూపర్ స్టార్లు' అయినా సరే తమను తాము ఎప్పటికప్పుడు నిరూపించుకోవాలని హెడ్ కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ గట్టిగానే చెబుతున్నారు.

తమ దృష్టిలో దిగ్గజాలు, యువ ఆటగాళ్లు సమానమనే సంకేతాలు ఇస్తున్నారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్ ను విజేతగా నిలిపిన తర్వాత కెప్టెన్ పదవి నుంచి రోహిత్ శర్మను తప్పించడం ఇందుకు నిదర్శనం. అంతేకాదు రోహిత్-కోహ్లి లను మేనేజ్ మెంట్ దేశీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో తప్పక ఆడాలని ఆదేశించింది.

ఈ ఇద్దరూ అక్కడా సత్తా చాటి తమను తాము నిరూపించుకున్నారు. అయినప్పటికీ వయసు రిత్యా రోహిత్-కోహ్లి ను వరల్ కప్ ఆడిస్తారా? లేదా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి తరుణంలో విరాట్ కోహ్లి తన భవిష్యత్తుపై మౌనం వీడాడు.

వన్డే వరల్ కప్-2027లో ఆడతారా? లేదా? అన్న అంశంపై స్పందిస్తూ.. "నా దృష్టి కోణం ఒక్కటే. నా జట్టు విలువ పెంచేలా నా శాయశక్తులా కృషి చేస్తా. అక్కడున్న వాళ్లు కూడా నా వల్ల జట్టుకు మేలు చేకూరుతుందని భావించాలి. అప్పుడే నేను జట్టులో ఉంటాను.

అయితే, పదే పదే నన్ను నేను నిరూపించుకోవాలనే ఒత్తిడి వస్తే.. అక్కడ నాకు స్థానం ఉండదని పరోక్షంగా నాకు నేను చెబుతున్నట్లు అర్థం. ఏదేమైనా నిజాయితీగా ఆట కోసం సన్నద్ధం కావడం అత్యంత ముఖ్యం. బ్యాటింగ్ చేయడానికి వెళ్లే ముందు ప్రతిసారి నా తల వంచుకుని.. కొత్తగా మైదానంలోకి దిగినట్లే వెళ్తాను.

నా క్రికెట్ కెరీర్ లో దేవుడు ఎన్నో అవకాశాలు ఇచ్చాడు. అందుకు నేను కృతజ్ఞుడిని. కఠినంగా శ్రమించడమే నాకు తెలుసు. సరైన రీతిలో ఆడటమే నా లక్ష్యం. అలాగే ఆడతాను కూడా. వన్డే మ్యాచ్ లో నలభై ఓవర్ల పాటు.. వికెట్ల మధ్య పరుగులు తీయాల్సి వస్తే నేను కచ్చితంగా ఆ పనిని పూర్తి చేస్తా.

నాకెలాంటి ఫిర్యాదులూ ఉండవు. ఎందుకంటే.. మ్యాచ్ లో ఊహించని పరిస్థితులు ఎదురైనా.. అందుకు తగ్గట్లుగా జట్టు కోసం ఉపయోగపడేలా ముందే నేను సన్నద్ధమవుతా. మ్యాచ్ లో ఎదుర్కొనే ప్రతి బాల్ నా కెరీర్ లో ఆఖరి బంతి అనే ఆలోచనతోనే సిద్ధమవుతా.

వికెట్ల మధ్య అలుపు లేకుండా పరిగెడతా. ఇంత చేసినా నా విలువ, స్థాయి ఏమిటో నిరూపించుకోవాలని అంటున్నారంటే.. అక్కడ నా అవసరం లేదు అని అర్థం. నాకు అది అక్కర్లేదు కూడా!" అని కోహ్లి నర్మగర్భ వ్యాఖ్యలు చేశాడు.

ఆర్సీబీ పాడ్కాస్ట్లో కోహ్లి చేసిన ఈ కామెంట్లు వైరల్ అవుతున్నాయి. గంభీర్, అగార్కర్ వైఖరి నచ్చకే అతడు ఈ విధంగా స్పందించాడని అభిమానులు అంటున్నారు.

కాగా 2024లో టీమిండియా టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్కు వీడ్కోలు పలికిన రోహిత్-కోహ్లి .. గతేడాది అనూహ్యంగా టెస్టులకూ గుడ్బై చెప్పారు. ఇప్పుడు ఇద్దరూ వన్డేలతో పాటు ఐపీఎల్లో కొనసాగుతున్నారు. ఆర్సీబీ తరఫున కోహ్లి ఐపీఎల్-2026 సీజన్లో ఇప్పటికి 12 మ్యాచ్లు ఆడి 484 పరుగులు సాధించాడు.

# రోహిత్ చెప్పిన మాటలే వింటా

**– తిలక్ వర్మ**



పంజాబ్ కింగ్స్ పై ముంబయి ఇండియన్స్ సంచలన విజయం సాధించడంలో తిలక్ వర్మ కీలక పాత్ర పోషించాడు. తన 75 పరుగుల అజేయమైన ఇన్నింగ్స్ తో ముంబయిని గెలిపించాడు. ఈ సందర్భంగా విభిన్నంగా సెలబ్రేషన్స్ చేసుకుంటూ కనిపించాడు. అయితే, ఇవన్నీ రోహిత్ శర్మ కోసమని ఆ తర్వాత తిలక్ తెలిపాడు. '45' అంకెలను చూపిస్తూ ఇది నీ కోసమని చెప్పడం విశేషం. డగౌట్ లోని రోహిత్ నవ్వుతూ కనిపించాడు.

అనంతరం డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లాక.. సైడ్ ఆర్మ్ స్పెషలిస్ట్ ముర్తుజా హుస్సేన్ తో రోహిత్, తిలక్ వీడియో కాల్ లో మాట్లాడారు. "మనతో ఆర్ఎస్ 45 ఉన్నారు. నేనెప్పుడూ రోహిత్ భాయ్ మాటే వింటా" అని తిలక్ హార్ట్ సింబల్ చూపించాడు. అనంతరం తిలక్ ఇన్నింగ్స్ను రోహిత్ ప్రశంసించాడు. తన ఇన్నింగ్స్ ను చూడొద్దని.. తిలక్ ఆటను చూడాలని చెప్పడం గమనార్హం. ఈ వీడియోను ముంబయి ఇండియన్స్ సోషల్ మీడియాలో పంచుకుంది.

# 'పెద్ది'.. ఆ విషయంలో సందేహం అక్కర్లేదు: దిల్ రాజు

'పెద్ది' సినిమా జూన్ 4న ఆరోగ్యకర వాతావరణంలోనే విడుదలవుతుందని, ఆ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని ప్రముఖ నిర్మాత దిల్ రాజు తెలిపారు. టాలీవుడ్ లో నెలకొన్న తాజా పరిస్థితులపై తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్ లో మీటింగ్ జరిగింది. సమస్యలపై చర్చించి, పరిష్కరించుకున్నాం. ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ఓ కమిటీ ఏర్పాటుకానుంది. ఏ, బీ, సీ.. ఇలా ఆయా సెంటర్లలోని థియేటర్ను బట్టి పర్సంటేజీని కమిటీ నిర్ణయిస్తుంది" అని తెలిపారు.



మల్టీప్లెక్స్ ల్లో ఉన్నట్టే సింగిల్ స్క్రీన్లలోనూ పర్సంటేజీ విధానం ఉండాలని, దీనికి అంగీకరించిన నిర్మాతల చిత్రాలనే ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, పర్సంటేజీ విధానం వల్ల తమకు నష్టమంటున్నారు నిర్మాతలు. 'పెద్ది'ని లక్ష్యంగానే చేసుకొని ఇలా డిమాండ్ చేయడం సరికాదని బదులిచ్చారు. తాము 2008 నుంచి పర్సంటేజీ విధానాన్ని కోరుతున్నామని, ఏ సినిమా గానీ, ఏ నిర్మాత గానీ తమ టార్గెట్ కాదనేది ఎగ్జిబిటర్ల వాదన. ఈ వ్యవహారంపై.. ఫిల్మ్ ఛాంబర్ లో.. వాణిజ్యమండలి అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత సురేశ్ బాబు ఆధ్వర్యంలో థియేటర్ల యజమానులు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సమావేశమయ్యారు. 15 మందితో ఓ కమిటీ ఏర్పాటుకానుండగా.. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఫిల్మ్ ఛాంబర్ ఆదేశించింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రమే 'పెద్ది'.

# పెద్ది ప్రమోషన్స్‌కు దూరంగా జాన్వీ కపూర్



శ్రీదేవి కుమార్తెగా సినీ రంగ ప్రవేశం చేసిన జాన్వీ కపూర్, బాలీవుడ్ లో పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో భారీ విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం ఆమె హిందీ కంటే తెలుగు ప్రాజెక్టులపైనే ఎక్కువ మొగ్గు చూపుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటిస్తోంది. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది.

అయితే, ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ప్రమోషన్లకు జాన్వీ దూరంగా ఉండబోతోందని వస్తున్న వార్తలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశమయ్యాయి. కేవలం భారీ రెమ్యూనరేషన్ కోసమే ఈ ప్రాజెక్టుకు సంతకం చేసిందని, సినిమాలో తన పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం వల్లే ఆమె ప్రమోషన్లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుందని ఒక ప్రముఖ దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ విషయంపై చిత్ర యూనిట్ నుండి ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ప్రమోషన్ల విషయంలో జాన్వీ వెనక్కి తగ్గితే అది ఆమె కెరీర్ పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే 'పెద్ది' వంటి ప్రతిష్టాత్మక చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఆమెకు ఉంది.

ప్రస్తుతం జాన్వీ చేతిలో చెప్పుకోదగ్గ పెద్ద ఆఫర్లు లేని తరుణంలో, 'పెద్ది' విజయం ఆమెకు టాలీవుడ్ లో మరిన్ని అవకాశాలను తెచ్చిపెడుతుంది. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొనకపోవడం జాన్వీ చేసే పెద్ద పొరపాటే అవుతుంది. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో, జాన్వీ తన నిర్ణయాన్ని మార్చుకుని ప్రమోషన్లలో భాగస్వామి కావాలని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మెగా ఫోన్ పట్టిన రామ్..



ఇప్పటివరకూ నటుడిగా, గాయకుడిగా, గేయరచయితగా తన ప్రతిభను చాటుకున్న రామ్ పోతినేని.. ఇప్పుడు దర్శకుడిగా తొలి చిత్రాన్ని రూపొందించేందుకు సిద్ధమయ్యారు. తన 23వ సినిమాకు తానే దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటించారు. తన పుట్టినరోజు సందర్భంగా స్వీయ దర్శకత్వంలో రానున్న సినిమా విశేషాలు పంచుకున్నారు.

ప్రస్తుతానికి 'RAPO23'గా ఈ సినిమా ప్రచారంలో ఉంది.



సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కించనున్నారు. 'రాపో సినిమాటిక్స్' బ్యానర్ పై కృష్ణ పోతినేని దీన్ని నిర్మించనున్నారు. ఇందులో రామ్ 'వీర' పాత్రలో కనిపించనున్నారు. లెదర్ జాకెట్ తో వెనకవైపు నిలబడి ఉన్న ఆయన లుక్ స్టైలిష్ గా ఆకట్టుకుంటోంది. పోస్టర్ ను పంచుకుంటూ 'ఒంటరి తోడేలు కథ ఇది' అనే ట్యాగ్ లైన్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ కథను కూడా రామ్ స్వయంగా సిద్ధం చేసినట్లు సమాచారం. జూన్ లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించి, డిసెంబర్ లో సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.

**రామ్ గురించి మీకు ఈ విషయాలు తెలుసా..**

- రామ్ పోతినేని యూట్యూబ్ లో హిందీ డబ్బింగ్ సినిమాలతో నార్త్ ఇండియాలో భారీ క్రేజ్ సొంతం చేసుకున్నారు.
- హిందీ డబ్బింగ్ సినిమాల ద్వారా 2 బిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి సౌత్ ఇండియన్ హీరోగా రికార్డు సృష్టించారు.
- 'కందిరీగ', 'నేను శైలజ', 'ఉన్నది ఒక్కటే జిందగీ', 'హలో గురు ప్రేమ కోసమే', 'డబుల్ ఇస్మార్ట్' సహా 9కి పైగా సినిమాలు 100 మిలియన్ ల క్లబ్ లో చేరాయి.
- యూట్యూబ్ లో 1 మిలియన్ సబ్ స్క్రైబర్స్ మార్క్ను అందుకున్న తొలి టాలీవుడ్ హీరోగా గుర్తింపు పొందారు.
- 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం రూ.65 కోట్లకుపైగా గ్రాస్ వసూలు చేసి రామ్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది.
- 11 ఏళ్ల వయసులోనే 'ఆడయాళం' షార్ట్ ఫిలింలో నటించి యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు.

# 'డ్రాగన్' ట్రీట్ కోసం ముంబైకి తారక్..?

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు పురస్కరించుకుని మే 20న ప్రశాంత్ నీల్ మూవీకి సంబంధించిన ట్రీట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, ఒకరోజు ముందుగానే అంటే మే 19వ తేదీ అర్ధరాత్రి 'డ్రాగన్' చిత్రానికి సంబంధించిన మొదటి గ్లింప్స్ ను విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది.



ఈ టీజర్ లాంచ్ కోసం ఎన్టీఆర్ స్వయంగా ముంబై వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ నేషనల్ మీడియా సమక్షంలో ఈ ఫస్ట్ లుక్ ను ప్రెజెంట్ చేయనున్నట్లు తెలుస్తోంది. 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.